
మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati
సంపుటి : 01 సంచిక :18 | బుధవారం ,18 డిసెంబర్ 2024 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## నేటిమాట



" మీరు ఎప్పటికీ జీవించినట్లు నేర్చుకోండి, రేపు మీరు చనిపోయేలా జీవించండి."
- మహాత్మా గాంధీ

# గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ..?

- కేసీఆర్ రావాలి? కేసీఆర్ సలహాలు ఇవ్వాలి.. సిఎం, మంత్రులు
- కేసీఆర్ ఎందుకు రావాలి? అధికారం ఇచ్చింది కాంగ్రెస్ కే కదా!
- కేసీఆర్ ని గౌరవ ముఖ్యమంత్రిని చేసి.. రేవంత్ ని వర్కింగ్ సిఎం చేయండి..

(శ్రీధర్ యాలాల - విశ్లేషకులు)

కెసిఆర్ అసెంబ్లీ కి రావాలి. కేసీఆర్ బయటకు రావాలి. కేసీఆర్ నువ్వు బయటకు ఎందుకు రావడం లేదు? ప్రజలంటే నీకు చులకనా? ఓట్లు వేసి నిన్ను ఎంఎల్ఏగా గెలిపిస్తే నువ్వు రావా? ఈ మాటలు తరచూ గత సంవత్సర కాలంగా మనం వింటూనే ఉన్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సో కాల్డ్ మేధావులు, కొంతమంది జర్నలిస్టులు అందరూ అనే మాట కేసీఆర్ బయటికి రావాలి. కేసీఆర్ అనావాళ్ళు లేకుండా చేస్తా... కేసీఆర్ అనే కలుపు మొక్కను మళ్ళీ మొలవనివ్వను అని సిఎం రేవంత్ రెడ్డి అన్న మాట. కానీ అదే రేవంత్ రెడ్డి ప్రతి రోజు ప్రతి సభలో, ప్రతి ప్రెస్ మీట్ లో కేసీఆర్ పేరు ఎత్తనిదే ముగించడు.



'కేసీఆర్' ఈ మూడు అక్షరాలు గత 20 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ రాజకీయాలలో మారుమోగుతూనే ఉంది. కేసీఆర్ ఏం మాట్లాడినా న్యూసే, అసలు మాట్లాడకుండా మౌనంగా ఉన్న న్యూసే. అలాంటి కేసీఆర్ గత ఎన్నికల్లో ఓడిపోయాక తుంటి ఎముక విరగడంతో రెస్ట్ తీసుకొని పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారం చేశారు. కానీ ఆ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెల్చుకోలేకపోయింది. దాంతో నిరాశ చెందిన కేసీఆర్ తన ఫారం హౌస్ కే పరిమితం అయ్యాడు. అప్పటినుండి ప్రతి రోజు ముఖ్యమంత్రి దగ్గర నుండి మంత్రులు, ఎంఎల్ఏలు, కాంగ్రెసు అనుకూల మీడియా అందరూ కేసీఆర్ బయటకు రావాలి అనే అంటున్నారు.

2లో

# కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధం

## ఏసీబీకి టీజీ సీఎస్ లేఖ




హైదరాబాద్,17డిసెంబర్,క్రాంతి న్యూస్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్వహించిన ఈ కార్ రేస్ కేసు అంశం ఇప్పుడు ఏసీబీ వద్దకు చేరింది. ఈ మేరకు తెలంగాణ సీఎస్ శాంతికుమారి..ఏసీబీకి లేఖ రాశారు. ఈ వ్యవహారంలో విచారణ కోరుతూ సీఎస్ లేఖ రాశారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని లేఖలో సీఎస్ పేర్కొన్నారు. దీనిలో భాగంగా గవర్నర్ అనుమతి ఇచ్చిన లేఖను సీఎస్ జత చేశారు. గవర్నర్ అనుమతితో ముందుకు. సోమవారం సాయంత్రం అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'ఫార్ములా-ఈ' కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై విచారణ చేపట్టేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై రాష్ట్ర మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది.

2లో

# దద్దరిల్లిన పార్లమెంట్..

## జమిలి ఎన్నికలపై హాట్ డిస్కషన్..

న్యూ ఢిల్లీ 17 డిసెంబర్, క్రాంతి న్యూస్



లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళిక ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకొచ్చింది. ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో అత్యంత కీలకమైన జమిలి ఎన్నికల బిల్లును ప్రవేశ పెట్టింది. ఎన్డీఏ మిత్ర పక్షాలు బిల్లులకు సంపూర్ణ మద్దతు తెలుపగా.. కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వీటికి అనుకూలంగా 269 మంది ఎంపీలు ఓటు వేయగా.. 198 మంది వ్యతిరేకించారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లోని వైసీపీ, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలు జమిలి ఎన్నికలకు తమ మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ మాత్రం జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. జమిలి ఎన్నికలపై కాంగ్రెస్ ఎంపీ ఎంపీ శశిథరూర్ స్పందించారు.

2లో

# బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

హైదరాబాద్,17 డిసెంబర్, క్రాంతి న్యూస్

అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌ల హోరు కొనసాగింది. అప్పులపై హరీశ్‌రావు-భట్టి మధ్య మాటల యుద్ధమే జరిగింది. లగచర్ల రైతుకు సంకెళు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నల్ల చొక్కాలతో అసెంబ్లీకి వచ్చారు. చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. అసెంబ్లీలో కూడా లగర్ల ఘటనపై చర్చకు పట్టుబట్టారు బీఆర్ఎస్ సభ్యులు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభలో దుమారం రేపారు. అరెస్ట్ అయిన లగచర్ల రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ తీరుపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు లేదంటూ మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎంతో మంది రైతులకు బేడీలు వేశారన్నారు మంత్రి సీతక్క. లగచర్ల ఘటనలో అధికారులను సస్పెండ్ చేశామన్నారు.

### రైతులు జైల్లో మగ్గుతుంటే రేవంత్ రెడ్డి, మంత్రుల్లో రాక్షసానందం - బీఆర్ఎస్



నల్లచొక్కాలు ధరించి.. చేతులకు బేడీలు ధరించి నిరసన
లగచర్ల ఘటనపై చర్చకు పారిపోతున్న ప్రభుత్వం
ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదు
పర్యాటక రంగంపై చర్చకు తొందర ఏముంది?
చర్చ అంటేనే మొహం చాటేస్తున్న రేవంత్
అసెంబ్లీలో మా గొంతు నొక్కవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో నొక్క లేరు

### కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారు - కేటీఆర్





# తెలంగాణలో మూడు కీలక బిల్లులు ఆమోదం..

తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. లగచర్ల ఘటనపై అసెంబ్లీలో చర్చ జరపాలని విపక్ష నేతలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. మంగళవారం జరిగిన సమావేశాల్లో కూడా ఈ ఘటనపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో సభలో మరోసారి గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్, బీపీపీ సభ్యుల ఆందోళనల మధ్యే అధికార పక్షం మూడు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులను ఆమోదించింది.

5లో

# కేసీఆర్ అమెరికా టూర్.. రేవంత్ రెడ్డి ఆపుతాడా..?

- విద్యుత్ కొనుగోళ్లు , కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ
- కేసులు తప్పించుకోవడానికే కేసీఆర్ అమెరికా పర్యటన - కాంగ్రెస్
- మనువడితో సమయాన్ని గడపడానికి అమెరికా టూర్ - బీఆర్ఎస్
- కేటీఆర్ అరెస్ట్ అయితే పర్యటన ఆగుతుందా?
- కేసీఆర్ పూర్తిగా రాజకీయాలకు దూరం అయ్యారా?



హైదరాబాద్,17 డిసెంబర్, క్రాంతి న్యూస్

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అమెరికా పర్యటనకు ఖరారైనట్టు తెలుస్తుంది. విద్యుత్ కొనుగోళ్లు , కాళేశ్వరం కమిషన్లు, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ జరుగుతున్న సమయంలో కేసీఆర్ అమెరికా పర్యటనపై కాంగ్రెస్ పార్టీలో అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. కేసులు తప్పించుకోవడానికే కేసీఆర్ అమెరికా వెళ్తున్నాడని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. కేటీఆర్ కొడుకు హిమాన్ష్ ప్రస్తుతం అమెరికాలోనే ఉంటున్నాడు. అయితే మనువడితో సమయాన్ని గడపడానికి కేసీఆర్ అమెరికా టూర్ వెళ్తున్నట్లు గులాబీ శ్రేణులు చెపుతున్నాయి. అలాగే కేసీఆర్ ఆరోగ్య సమస్యలకు హెల్త్ టెస్టులు కూడా చేయించుకోనున్నారని టాక్. ఈ పర్యటన 2025 ఫిబ్రవరిలో పూర్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

2లో

# టీజీపీఎస్సీనా, టీడీపీఎస్సీనా?..

## తెలంగాణవాదుల ఫైర్

- గ్రూప్-2లో బాబు భజన
- తెలంగాణ పోరాటాన్ని చెరిపేసేలా ప్రశ్నలు!
- ఉద్యమ చరిత్ర ప్రశ్నపత్రంపై సర్వత్రా విమర్శలు
- రాష్ట్ర ఉద్యమ చరిత్రను కాదని, ద్రోహుల చరిత్రకు పెద్దపీట
- తెలుగుదేశం, ఆంధ్రా ఆనవాళ్లను నిక్షిప్తం చేసే యత్నం
- టీడీపీ, తెలంగాణ వ్యతిరేకులను ప్రస్తావిస్తూ పలు ప్రశ్నలు
- టీజీపీఎస్సీనా, టీడీపీఎస్సీనా?.. తెలంగాణవాదుల ఫైర్
- సీఎం స్వామిభక్తిని చాటుకున్నాడంటూ మండిపాటు






3లో



## రేవంత్ కోర్టుకు రావాల్సిందే

2లో



గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారికి గన్నవరం విమానాశ్రయంలో హార్ధిక స్వాగతం పలికిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు



## నాగబాబుకు సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ?

4లో



## టీడీపీ నేతల హత్యలకు ప్లాన్లు వేస్తున్న అప్పలరాజు ?

4లో



8లో

## స్పిరిట్‌లో మృణాల్ ఠాకూర్ ?

# కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

**కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధం**

తెలంగాణ రాష్ట్రంలో కేటీఆర్ అరెస్ట్ వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచింది. ఇదే ఇప్పుడు ట్రెండింగులోనూ ఉంది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారంటూ గత కొద్ది నెలలుగా ప్రచారం జరుగుతూనే ఉంది. కానీ.. ఇంతవరకు అరెస్ట్ విషయంలో ఎలాంటి ముందడుగు పడలేదు. ఈ రోజు కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు తెలిసింది. కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ప్రభుత్వం నుంచి అప్పీల్ చేశారు. నెలన్నర రోజులుగా అది గవర్నర్ వద్దే పెండింగులో ఉండిపోయింది. తాజాగా.. దానికి గవర్నర్ నుంచి ఆమోదం లభించిందని, సంబంధిత ఫైల్ రాష్ట్ర ప్రభుత్వానికి చేరిందని సమాచారం. ఈ క్రమంలో కేటీఆర్‌పై ఏ క్షణాన అయినా ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తుంది.

**అసలు కేసు ఏంటి?**

నాలుగేళ్లపాటు హైదరాబాద్ మహానగరంలో ఫార్ములా- ఈ కారు రేసు నిర్వహణకు సంబంధించి ఎఫ్ఈఓ, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేటు లిమిటెడ్‌తో కలిసి పురపాలక శాఖ 2022 అక్టోబర్ 25 త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు 2023 ఫిబ్రవరి 10,11 తేదీల్లో నిర్వహించిన ఈ కార్ల రేస్‌కు దేశవ్యాప్తంగా అభిమానులు వచ్చారు. అయితే ప్రమోటర్ ఏస్ నెక్ట్స్‌జెన్ సంస్థ ఆశించిన మేరకు ఆదాయం రాలేదు. దాంతో ఆ ప్రమోటర్ తప్పుకున్నారు. ఇక.. 2024 ఫిబ్రవరి 10న జరగాల్సిన రెండో దఫా ఈ కార్ రేసు నుంచి హైదరాబాద్ పేరును ఎఫ్ఈఓ తొలగించింది. అయితే.. అప్పటి మంత్రి కేటీఆర్ ఫార్ములా ఈ నిర్వహిస్తే హైదరాబాద్‌కు తలమానికంగా ఉంటుందని భావించారు. దాంతో 2024 ఫిబ్రవరిలోనూ హైదరాబాద్‌లోనే నిర్వహించాలని కోరారు. ప్రమోటర్ నిర్వహించే బాధ్యతలను నోడల్ ఏజెన్సీగా హెచ్ఎండీఏ చూసుకుంటుందని ఎఫ్ఈఓకు చెప్పారు.


దాంతో రెండో దఫా ఈ కార్ రేసు 2023 అక్టోబర్‌లో ఎఫ్ఈఓతో పురపాలక సంఘం ఒప్పందం కుదుర్చుకుంది. రేస్ నిర్వహణకు రూ.100 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందులోభాగంగా హెచ్ఎండీఏ రూ.55 కోట్లను ఎఫ్ఈఓకు సైతం చెల్లించింది. అయితే.. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పురపాలక శాఖ ఒప్పందంలోని అంశాలను ఉల్లంఘించారంటూ ఎఫ్ఈఓ సెషన్ 10ను రద్దు చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రూ.55 కోట్లను విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు చేయడాన్ని సీరియస్‌గా తీసుకుంది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మెమో జారీ చేశారు.

ఆ మెమోకు అప్పటి పురపాలక శాఖ అధికారి అర్వింద్ కుమార్ వివరణ ఇచ్చారు. తాను ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని, అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకే చెల్లింపులు చేశామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఫార్ములా ఈ రేసుకు సంబంధించి ఏసీబీ విచారణ చేయాలంటూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ లేఖ రాశారు. దీనికి ప్రభుత్వం సైతం సమ్మతించింది. ఏసీబీ జేడీ స్థాయి అధికారి నేతృత్వంలోని అధికారులు ఫార్ములా ఈ రేసు అంశాన్ని తిరగదోడారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి చీఫ్ ఇంజినీరుతోపాటు గత ప్రభుత్వం పురపాలక శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ఏసీబీ లేఖ రాసింది. ఈ మేరకు ఇద్దరు అధికారులపై విచారణకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రజాప్రతినిధి అయిన కేటీఆర్‌పై కేసు నమోదుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు లేఖ రాశారు. ఈ అంశంపై న్యాయ సలహా తీసుకున్న అనంతరం గవర్నర్ అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఏసీబీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందా అని వేచి చూడాలి.

# రేవంత్ కోర్టుకు రావాల్సిందే

## ఓటుకు నోటు కేసులో ఈడీ కోర్టు ఆదేశం

మొదటి పేజీ తరువాయి



ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రెండు నెలల సమయం కావాలన్న నిందితుల విజ్ఞప్తిని నాంపల్లి ఈడీ కోర్టు జడ్జి రమేశ్ తిరస్కరించారు. తదుపరి విచారణ జరుగనున్న జనవరి 10న సీఎం రేవంత్‌రెడ్డి సహా నిందితులందరూ కోర్టుకు హాజరుకావాలని హెచ్చరిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాంపల్లి ఈడీ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన కేసులో సోమవారం వాదనలు ముగిశాయి. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఉదయ్ సింహా (ఏ2), జెరూసలేం మత్తయ్య (ఎ4), సండ్ర వెంకటవీరయ్య (ఎ7) మాత్రమే కోర్టుకు హా జరయ్యారు.

మిగతావారి తరఫున న్యాయవాదులు గైర్హాజరీ పిటిషన్లు దా ఖలు చేశారు. వేంనరేందర్‌రెడ్డి కుమారుడు వేంకీర్తన్‌రెడ్డి పేరును కేసులోనుంచి తొలగించాలని ఇటీవల దాఖ లు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈడీ న్యాయస్థా నం విచారణ ప్రారంభించాలని జెరుసలేం మత్తయ్య తరఫు న్యాయవాది జడ్జిని కోరారు. తమకు మరికొంత సమయం కావాలని వేం నరేందర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాదులు కోరగా కోర్టు తోసిపుచ్చింది. తెలంగాణ హైకోర్టులో క్వాష్ కొట్టివేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సమయం కావాలని కోరినప్పటికీ కోర్టు నిరాకరించింది.

# ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్య



హైదరాబాద్ : హయత్‌నగర్‌లో విషాదం నెలకొంది. స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ పాఠశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు భారీగా మోహరించారు.ప్రయివేటు పాఠశాల ఆవరణలోని హాస్టల్ గదిలో విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అయితే గది తలుపులు ఎంతకీ తీయకపోవడంతో తోటి విద్యార్థులకు అనుమానం వచ్చి హాస్టల్ సిబ్బందికి సమాచారం అందించారు. పోలీసులు, హాస్టల్ సిబ్బంది కలిసి తలుపులు విరగ్గొట్టి చూడగా, విద్యార్థి ఫ్యాన్‌కు వేలాడుతున్న దృశ్యం కనిపించింది.అయితే విద్యార్థి మానసిక ఒత్తిడికి గురై, ఈ దారుణానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. డెడ్‌బాడీని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# దద్దరిల్లిన పార్లమెంట్..

## జమిలి ఎన్నికలపై హాట్ డిస్కషన్..

వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే రెండు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఓటింగ్‌లో బీజేపీకి రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లేదని తేలిందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మంగళవారం ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ బిల్లును మేము (కాంగ్రెస్) మాత్రమే వ్యతిరేకించలేదు. మెజారిటీ ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పడిపోతే రాష్ట్ర ప్రభుత్వం పడిపోతుందా? ఇది ఎలా సాధ్యమని బీజేపీ కూటమిని ప్రశ్నించారు. ఈ వ్యవస్థను ఇలా మార్చడంలో అర్థం లేదని ఆయన అన్నారు, ఎందుకంటే కేంద్రంలో లేదా రాష్ట్రాల్లో రాబోయే ప్రభుత్వం మెజారిటీ విశ్వాసాన్ని కోల్పోయినప్పుడు అది మళ్లీ అదే గందరగోళానికి దారి తీస్తుందని ఆయన వివరించారు. ఏది ఏమైనప్పటికీ, రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ బీజేపీకి లేదని ఈ రోజు ఓట్లు నిరూపించాయని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు.

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. మరోవైపు సొంత ఎంపీలు సైతం బీజేపీకి షాకిచ్చారు. లోక్‌సభలో జమిలి ఎన్నికల బిల్లుపై చర్చ జరిగే సమయంలో 20మంది బీజేపీ ఎంపీలు గైర్హాజరయ్యారు. గతంలోనే, జమిలి ఎన్నికల బిల్లుపై చర్చ జరిగే సమయంలో లోక్‌సభ సభ్యులు సభకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఎంపీలు చర్చలో పాల్గొనలేదు. జమిలి ఎన్నికలు సొంత పార్టీ నేతల నుంచి మద్దతు లేదని, అందుకు ఆ 20 మంది బీజేపీ ఎంపీల తీరేనని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీంతో సొంత పార్టీ ఎంపీలకు బీజేపీ అధిష్టానం నోటీసులు జారీ చేసింది. సుమారు 20మంది ఎంపీలకు బాధ్యతారాహిత్యం కింద నోటీసులు జారీ చేసింది.

### జేపీసికి పంపుతామన్న అమిత్ షా

జమిలి బిల్లు కేంద్ర క్యాబినెట్ ముందు చర్చకు వచ్చిన సమయంలో.. ఆ బిల్లును పార్లమెంట్ స్థాయి సంఘానికి పంపాలని ప్రధాని మోదీ సూచన చేసినట్లు కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. బిల్లును ఉపసంహరించుకోవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న సమయంలో.. కేంద్ర మంత్రి షా ఈ వ్యాఖ్యలు చేశారు. ఐయూఎంఎల్ నేత ఈటీ మొహమ్మద్ బషీర్, ఆర్ఎస్పీ ఎంపీ ఎన్కే ప్రేమచంద్రన్.. బిల్లును వ్యతిరేకించారు.

విలేకరులు కావలెను..
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా?
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?
మన క్రాంతి తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు మండలాల వారీగా విలేఖరులు,
యాడ్ ఎగ్జీక్యూటివ్ లు (పురుషులు మరియు స్త్రీలు) కావలెను.
కాల్ : 9281041008 వెబ్: https://epaper.krtvnews.com
ఈమెయిల్: krtv.md@gmail.com

# గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ..?

మొదటి పేజీ తరువాయి

(శ్రీధర్ యాలాల – విశ్లేషకులు)

అసలు కేసీఆర్ ఎందుకు బయటకు రావాలి? ప్రజలు కేసీఆర్ ని ఓడగొట్టి ఇంట్లో కూర్చోబెట్టారు. వీళ్ళు మరిచిపోతున్నట్టున్నారు ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రజలకు వివరంగా చెప్పాడు. "నేను క్లియర్‌గా చెబుతున్నా.. నాకు డెబ్బయి సంవత్సరాల వయసొచ్చింది.. నాకు జీవితంలో ఇంకా ఏం కావాలి? తెలంగాణ తెచ్చాననే పేరే నాకు ఆకాశమంత పెద్దది. అయినా మీరు మన్నించి ఇచ్చిన్రు కాబట్టి రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన . నాకన్నా ఎక్కువ కాలం పనిచేసిన తెలుగు ముఖ్యమంత్రి ఎవ్వరూ లేరు. నేను ఇవాళ కొట్లాడేది, పదవి కోసం కాదు. పేదరికం లేని తెలంగాణ కావాలి.. కేరళ రాష్ట్రం మాదిరిగా వంద శాతం అక్షరాస్యత ఉన్న తెలంగాణ కావాలి. సమృద్ధిగా పంటలు పండి, రైతాంగం గుండె మీద చేయి వేసుకొని హాయిగా నిద్రపోయే తెలంగాణ కావాలి. తెలంగాణలోని సాగుభూముల్లో ప్రతి ఇంచుకు నీళ్లు రావాలి. ఇదీ నా పంతం! దయచేసి మీకు విజ్ఞప్తి చేసేదొక్కటే. పార్టీల వైఖరి, నాయకుల ఆలోచనా సరళి.. అన్నీ ఆలోచించి ఓట్లేయాలి తప్ప. ఆగంకావొద్దు. మీరు నన్ను ఓడగొడితే నాకు పోయేదేమీ లేదు... మీ బతుకులే ఆగమయితాయి. నన్ను ఒడగొట్టి ఇంట్లో కూర్చోబెడితే... నా ఫామ్ హౌస్ కి పోయి వ్యవసాయం చేసుకుంటూ బతుకుతా.. కానీ మీ బతుకులే ఆగమవుతాయి ఆలోచించి ఓటేయండి" అని చెప్పాడు. కానీ ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలను నమ్మి కేసీఆర్ ని ఓడగొట్టారు. దాంతో కేసీఆర్ ఫార్మ్ హౌస్ కే పరిమిత అయ్యాడు.

క్షేత్ర స్థాయిలో కేటీఆర్, హరీష్ రావు ప్రతిపక్ష నాయకుల పాత్ర పోషిస్తున్నారు. అనుక్షణం ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన నిలదీస్తున్నారు. కానీ ఎక్కడో వెలతి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఆ ఇంపాక్ట్ వేరేగా ఉంటుందని సామాన్య ప్రజలు, మెదవులు, జర్నలిస్టులు నమ్ముతున్నారు. గత ఎండకాలంలో మేడిగడ్డ బ్యారేజి కుంగిదనీ కాళేశ్వరంని ఎండబెట్టి రైతుల పొట్టకొట్టింది రేవంత్ సర్కారు. ఆ సమయంలో కేసీఆర్ ఒక్క మాట అనేసరికి వెంటనే రాజరాజేశ్వరీ, రంగనాయక సాగర్ రిజర్వాయర్ లను నింపింది ప్రభుత్వం. అది కేసీఆర్ కి ఉన్న చరిష్మ. అందుకే కేసీఆర్ రావాలి మాట్లాడాలి అని కోరుకుంటున్నారు. ఆఖరికి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కొందరు జర్నలిస్టులు కూడా కేసీఆర్ రావాలి మాట్లాడాలి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి అని కోరుతున్నారు.


ఒకవేళ కేసీఆర్ బయటకు వచ్చి ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఈ మేదావులే, ఈ జర్నలిస్టులే కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వరా? రాత్రికి రాత్రే అద్భుతాలు జరిగిపోతాయా? అని మళ్ళీ విమర్శిస్తారు. అందుకే కేసీఆర్ ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చాడు. రేవంత్ రెడ్డి తన స్థాయిని మరిచి కేసీఆర్ ని ఎన్ని బూతులు తిట్టినా.. ఎంత దుర్భాషలాడిన ఒక్కటంటే ఒక్క మాట కూడా అనలేదు. అందులో ఆ మధ్య ఒక టివి చానెల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా చెప్పాడు. 5 ఏండ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండాలని కోరుకుంటున్నా అని. ఇక్కడే కేసీఆర్ ఎంత హుందా తనం ప్రదర్శించాడో అర్థం చేసుకోవవచ్చు.

అంటే కేసీఆర్ ప్రజా సమస్యలపై నోరు విప్పడా? ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటే కేసీఆర్ ఫారం హౌస్ లోనే పడుకుంటాడా? ప్రజాలంటే లెక్కలేదా అన్నవాళ్లు ఉన్నారు. కానీ ప్రజా సమస్యలపై గళం విప్పడానికి తాను తయారు చేసిన ఉద్దండులు హరీష్, కేటీఆర్ ఎలాగో ఉన్నారు. అసెంబ్లీలో కూడా తమదైన సబ్జెక్టు, చాకచక్యంతో ప్రభుత్వాన్ని చెడుగుడు ఆడేసుకుంటున్నారు. ఎన్నికల తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశంలోనే శ్వేత పత్రాల పేరిట గత ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించి ఇచ్చిన హామీలను ఎగగోడుదాం అని ప్రయత్నించిన ప్రభుత్వాన్ని హరీష్, కేటీఆర్ నిలదీసిన వైనాని చూసి కేసీఆర్ వారిద్దరే చాలు అని మౌనంగా ఉన్నాడు. ఎప్పటికప్పుడు హరీష్, కేటీఆర్ వెనకాల ఉండి దిశానిర్దేశం చేస్తున్నాడు. అందుకే ప్రతి సమస్యపై ప్రభుత్వానికి ఊపిరాడనివ్వడం లేదు బావబామ్మర్దులు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది కాలంగా కేసీఆర్ ని తిట్టను తిట్టు లేదు. నోరు తెరిస్తే బూతుపురాణమే. కానీ ఏమైందో ఏమో కానీ గత నెల రోజులుగా కేసీఆర్ మీద కాస్త తగ్గినట్టున్నాడు. బహుశా కేసీఆర్ అసెంబ్లీ కి వచ్చి మాట్లాడితే ముఖ్యమంత్రి అని తనని పిలువాలని కోరుకుంటున్నాడేమో. లేక హరీష్, కేటీఆర్ తన స్థాయి వాళ్ళు కాదని కేవలం కేసీఆరే తన స్థాయి ప్రత్యర్థనీ అనుకుంటుండోచ్చు. ఏది ఏమైనా ఈ మధ్య కాలంలో కేసీఆర్ బయటకు రావాలి, అసెంబ్లీ కి రావాలి, తన అనుభవంతో సలహాలు, సూచనలు ఇవ్వాలి అని కోరుకుంటున్నాడు. మరి కేసీఆర్ ని అడిగే మనిఫెస్టో తయారు చేశారా? కేసీఆర్ ని అడిగే 6 గ్యారంటీలు ఇచ్చారా? కేసీఆర్ ని అడిగే 420 హామీలు ఇచ్చారు. ఇప్పుడు కేసీఆర్ ఎందుకు వచ్చి సలహాలు సూచనలు ఇవ్వాలి. మీకు పాలన చేతకాదా? ఒకవేళ మీకు నిజంగా పాలన చేతకాదు అంటే పార్టీలలో గౌరవాధ్యక్షుడు అన్న పదవి ఉంటది కదా అలానే కేసీఆర్ కి గౌరవ ముఖ్యమంత్రిని చేసి మళ్ళీ కూర్చోబేట్టండి. రేవంత్ రెడ్డి పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్ లాగా వర్కింగ్ సిఎంలాగా ఉండమనండి. అప్పుడు కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎలా నడపాలో సలహాలు, సూచనలు ఇస్తారు. ఎలాగో ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రి ఉండడం లేదు కదా... ఆ ప్రగతి భవన్ లో కేసీఆర్ కి కేటాయించండి. రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుండి కేసీఆర్ డైరక్షన్ లో పరిపాలించమనండి. అప్పుడు రెండు పార్టీల కలిసి పనిచేస్తే ప్రజలకు మేలే కదా. ఏమంటారు?

# కేసీఆర్ అమెరికా టూర్.. రేవంత్ రెడ్డి ఆపుతాడా..?





మొదటి పేజీ తరువాయి

మరి రేవంత్ రెడ్డి కేసీఆర్ అమెరికా టూర్ అడ్డుకుంటారా..? లేదా తిరిగి వచ్చాకా ఆయా కేసుల్లో విచారణ చేస్తారా అన్నది ఉత్కంటరేపుతుంది . ఏదో ఒక విచారణలో నోటీసులు ఇచ్చి గులాబీ బాస్ కేసీఆర్‌ను అమెరికా పోనివ్వకుండా చేస్తాడా అనేది చూడాలి. ఒకవేళ ఈ–ఫార్ములా వ్యవహారంలో కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేసీఆర్ అమెరికా పర్యటన ఆగిపోతుందా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్, యాదాద్రి పవర్ ప్లాంట్ విచారణలు జరుగుతున్న సమయంలో కేసీఆర్ అమెరికా వెళ్లడం సాధ్యమేనా..? రేవంత్ సర్కార్ కేసీఆర్ అమెరికా పర్యటనకు బ్రేక్ వేస్తోందా..? అనే అనుమానాలు గులాబీ శ్రేణుల్లో వ్యక్తం అవుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్‌లో కీలక నిందితుడు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కూడా అమెరికాలోనే ఉన్న సంగతి తెలిసిందే.

ఇదిలా ఉంటే కేసీఆర్ అమెరికా వెళ్లడం ఇదే మొదటి సారి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 సంవత్సరాల్లో కూడా ఆయన అమెరికా వెళ్లలేదు. రెండు విదేశీ పర్యటనలతో అతి తక్కువ దేశాలకు వెళ్లిన సీఎంగా కేసీఆర్ ఇప్పటి వరకు ఉన్నారు. ఆయన ముఖ్యమంత్రి హోదాలో చైనా, సింగపూర్ మాత్రమే వెళ్లారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలు అన్నీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావులే చూసుకుంటున్నారు. ఇటీవలే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో జైలులో ఉండి విచారణ ఎదుర్కొన్న కవిత కూడా సంవత్సరం తర్వాత రాజకీయాల్లో క్రియాశీలకంగా మారారు.

### విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో విచారణ

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌ఘడ్‌తో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలొచ్చాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎల్. నరసింహారెడ్డి చైర్మన్‌గా న్యాయ విచారణ కమిషన్ వేసింది. పవర్ కమిషన్ చైర్మన్‌ను మార్చాలని కేసీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో జస్టిస్ భీం రావ్ లోకూర్ కమిషన్ చైర్మన్ గా నియమితులైయ్యారు. విద్యుత్ ఫ్లాంట్ల నిర్మాణాలు, కొనుగోలుకు సంబంధించి జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి హయాంలో జరిగిన విచారణ డాక్యుమెంట్స్ పరిశీలన పూర్తి కావడంతో తదుపరి విచారణ ప్రక్రియపై జస్టిస్ లోకూర్ దృష్టి పెట్టారు. కమిషన్ స్టాఫ్‌తో జస్టిస్ భీం రావ్ లోకూర్ సమావేశం అయ్యారు. విద్యుత్తు కోనుగోలు ఒప్పందాలు, యాదాద్రి, భద్రాద్రి థర్మలో ఫ్లాంట్ల నిర్మాణాలలో అవతవకలపై విచారణ చేపట్టిన పవర్ కమిషన్ తొలి చైర్మన్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి అధికారులను, మాజీ విద్యుత్తు శాఖ మంత్రి జి.జగదీశ్ రెడ్డిని విచారించడంతో పాటు మాజీ సీఎం కేసీఆర్ నుంచి వివరణ ఇవ్వాలని కోరారు. అయితే ఆ విచారణలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు కొందరి పేర్లు ప్రస్తావించినట్లు సమాచారం. విద్యుత్ కొనుగోళ్ల విచారణ తుది దశకు వచ్చింది.

### కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ రిపోర్ట్

లక్ష కోట్ల నిధులతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం గురించి విచారించడానికి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ను ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ నివేదికను 2024 డిసెంబరు లోగా ఇవ్వాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం కోరింది. ఈ మేరకు కమిషన్ విచారణ చేసి నివేదికను సమర్పించే గడువును డిసెంబరు నెలాఖరుదాకా పొడిగిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు. వాస్తవానికి ఈ నవంబర్ 12 నుంచి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మూడో విడత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది. అయితే గడువు పొడిగింపు జీవో వెలువడనందున జస్టిస్ పీసీ ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ షెడ్యూల్‌ను ప్రకటించలేదు.

### ఫోన్ ట్యాపింగ్ కేసు ఇన్వెస్టిగేషన్

అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం కొందరి ఫోన్లు ట్యాపింగ్ చేసిందని ఆరోపణలు ఉన్నాయి. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, సీఐ ప్రణీత్, భుజంగరావు, రాధాకిషన్ రావులు ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితులుగా ఉన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ ఇన్వెస్టిగేషన్ చేస్తోంది. ఇటీవల నకరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చారు. ఈ కేసు విచారణ కూడా వేగంగా జరుగుతుంది. భుజంగరావు, రాధాకిషన్ రావులు పోలీస్ కస్టడీలో ఉన్నారు. కేసులో ఇన్వాల్ అయిన ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికాలోనే ఉన్నారు. ఈ క్రమంలో కేసీఆర్ అమెరికాను రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లనివ్వకుండా అపగలుగుతాడా? లేదా అన్నది వేచి చూడాలి.

# ఎనిమిదవ రోజుకు చేరుకున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె



చెన్నరావుపేట ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ఈరోజు హనుమకొండ లోని ఏకశిలా పార్క్ దగ్గర ల సమ్మె శిబిరంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి పాల్గొని మాట్లాడుతూ ఈరోజు తో ఎనిమిది రోజులుగా ఎం ఈ ఓ మరియు డి ఈ ఓ కార్యాలయముమూతపడ్డాయి, విద్యాశాఖ అడ్మినిస్ట్రేషన్పూర్తిగా స్థంభించినది మరియు కె జి బి వి, యు ఆర్ ఎస్, భవిత పాఠశాలలో బోధన బంద్ ఐనది, పాఠశాల విద్యావ్యవస్థ అడ్మినిస్ట్రేషన్ యు డి ఐ ఎస్ ఈ , ఏ ఏ పీ ఏ ఆర్ , ఎం డి ఎం ఆన్లైన్ పనులు కుంటుపడుతున్నది. ప్రభుత్వం స్పందించి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత సంవత్సరం 13-09-2023 న హన్మకొండలోని ఏకశిల పార్క్ దీక్ష శిబిరంలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని, తక్షణమే పే స్కెల్ అమలు చెయ్యాలని, రీ ఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ నియామకలలో వెయిటేజ్ కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఎక్సగ్రేషియా కల్పించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికి అయినా ప్రభుత్వం స్పందించి సంఘ నాయకులను పిలిచి సమస్యలు పరిష్కారం చేయ్యాలని, తక్షణమే పే స్కెల్ అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటన చేయ్యాలి. లేనిచో మా సమస్యలు తీర్చే వరకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కొనసాగుతది అని అన్నారు.త్వరగా ప్రభుత్వం స్పందించి వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగులని రెగ్యులర్ చేయాలి డిమాండ్ చేశారు.సమగ్రశిక్షా అభియాన్ జిల్లా ప్రెసిడెంట్ దోనికేల శ్రీధర్ గౌడ్,హనుమకొండ జిల్లా అధ్యక్షులు షఫీ, యూనియన్ నాయకులురమాదేవిరమేష్,అనందం,స్వాతి,మనోజ,యాదగిరి,రాజు,సంపత్,స్వామి,బాలు,రమేష్,సుజాత,పల్లవి,తేజస్విని,స్వప్న,,చారి వెంకన్న,రాజేష్,శ్రీనివాస్ రాము,సాగారిక,సమగ్ర శిక్షా ఉద్యోగులు అందరు ఉన్నారు.

# వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వరంగల్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో ప్రభుత్వ అధికారులతో కలిసి ఘనముగా మినీ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ క్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ క్రైస్తవ పాస్టర్లలను ఉద్దేశించి మినీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్. సి. ఆర్ ఎఫ్. జాతీయ అధ్యక్షులు.రెవ అబ్రహం . రెవ. డాక్టర్ మంద కుమార్ . పాస్టర్ కనకం కరుణాకర్ . బిషప్. డానియల్ . రెవ గ్యాబ్రిల్ మరియు రెవ రూబెన్ . రెవ జన్ను ప్రభాకర్, పాస్టర్ వసుకుల వినయ్ తదితర పాస్టర్లు మరియు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# తెలంగాణ

# టీజీపీఎస్సీనా, టీడీపీఎస్సీనా?..

## తెలంగాణవాదుల ఫైర్

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమం ఆధునిక ప్రపంచంలోనే ఒక జాతి సలిపిన మహోన్నత పోరాటం. ప్రజాస్వామ్యబద్ధంగా సాధించిన అద్భుత విజయం. అరవై ఏండ్లుగా తెలంగాణ వనరులను, జలాలు, నిధులను దోపిడీ చేసిన వలస పెట్టుబడిదారీ వ్యవస్థను, వలస పెత్తందారీతనం మెడలు వంచి సాధించిన అద్భుత విజయం. ఎన్నో వేదికలు, మరెన్నో పోరాట రూపాలను, ఇంకెన్నో ఉద్యమ పాఠాలను నేర్పిన సందర్భం. ఇదీ తెలంగాణ ఉద్యమ చరిత్ర. సాధించిన ఘనత. ఎక్కడైనా సరే చరిత్ర నిర్మాతలను తలుస్తారు. పోరాట యోధులను కొలుస్తారు. పోరాట ఘట్టాలను మననం చేసుకుంటారు. ముందుతరాలకు ఆ పోరాట గాథలను పాఠాలుగా చెప్తారు. కానీ, పోరాటాన్ని నిర్వీర్యం చేసే శక్తులను లేశమాత్రమైన స్మరించరు. వారి పేర్లను ఉచ్చరించడాన్ని సహించరు. కానీ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అందుకు భిన్నమైన దుస్థితి. ఉద్యమ ద్రోహులదే చరిత్రగా చలామణి అవుతున్నది. చరిత్రగా చిత్రీకరించే ప్రయత్నం ముమ్మరంగా కొనసాగుతున్నది. అందుకు తాజాగా గ్రూప్-2 పరీక్షలో ఉద్యమ చరిత్ర పేపర్లో అడిగిన ప్రశ్నలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఉద్యమ చరిత్రను తక్కువ చేస్తూ, నాటి ఉద్యమ ద్రోహులకు సంబంధించిన అంశాలను ప్రస్తావించడమే అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఉద్యమ చరిత్రను చెరిపే కుట్రలకు అద్దం పడుతున్నది. సోమవారం నిర్వహించిన గ్రూప్ -2 తెలంగాణ ఉద్యమ చరిత్ర పేపర్లో ఏకంగా 13కు పైగా ప్రశ్నల్లో ఆంధ్రా ప్రాంతం, చంద్రబాబుకు సంబంధించినవే ఉండటం గమనార్హం.

### ద్రోహుల చరిత్రకు పెద్దపీట

ఆనవాళ్లు చెరిపేస్తా, నిశాన లేకుండా చేస్తానన్న రేవంత్‌రెడ్డి సర్కారు అన్నంతపనీ చేసిం ది. తెలంగాణ అసలు చరిత్రను చెరిపేసేందుకు పూనుకుంది. ద్రోహుల చర్రితను క్రమంగా తెలంగాణలో వ్యాప్తి చేయనున్నది. అదే అస లు చరిత్ర అని ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. చంద్రబాబు, రాయపాటి, కావూరి, లగడపాటి పచ్చి తెలంగాణ వ్యతిరేకులు. నరనరాన తెలంగాణ వ్యతిరేకతను ఒంటబట్టించుకుని రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన వారు. వీరిని తలచుకోవడం, వీరి కంపెనీల గు రించి గుర్తుచేసుకోవడం దౌర్భాగ్యమని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతాలకు చెందిన కంపెనీలు, అది దివాలా తీసిన, బ్యాంకులను మోసం చేసిన కంపెనీలకు సంబంధించిన ప్రశ్నలిచ్చారు. తె లుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదు అనడం వెనుక ఇదే కుట్ర దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాల్లో ఏపీ చరిత్రను తొలగించి పూర్తిగా తెలంగాణీకరించారు. ఇది టీజీపీఎస్సీ కాదు, టీడీపీఎస్సీ అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మొత్తం మీద చంద్రబాబు మీదున్న స్వామిభక్తిని రేవంత్‌రెడ్డి ఇలా చాటుకున్నాడంటూ సోషల్ మీడియాలో పలువురు పెట్టిన పోస్టులు వైరల్ అయ్యాయి.

### అంతా బాబు భజనే

గ్రూప్ -2 పేపర్ చూస్తే తెలంగాణ ఉద్యమ చరిత్ర ప్రశ్నపత్రమా? లేక, టీడీపీ సన్మాన పత్రమా? అన్న అనుమానం రాకమానదు. గ్రూప్-2 క్వశ్చన్ పేపర్లో రేవంత్‌రెడ్డి పూర్తిగా చంద్రబాబు భజన చేయించాడు! రెండు కళ్ల సిద్ధాంతి చంద్రబాబుకు సంబంధించిన ప్రశ్నలను ప్రశ్నాపత్రం నిండా అచ్చొత్తించాడు! క్వశ్చన్ పేపర్ అంతా బాబు భజనను దగ్గరుండి చేయించినట్టున్నాడు! తెలుగుదేశం పార్టీ ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖ ఇచ్చిన విషయం అత్యంత ప్రధానమైన ప్రశ్న అట! చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్న సంగతి ప్రశ్నాపత్రంలో ఇప్పుడు గుర్తు చేయాల్సిన అవసరం ఏముంది? చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విజన్-2020 డాక్యుమెంట్ తయారు చేసిన సంస్థ ఏదైతే మనకేంటి? ఆ విషయం ఇప్పుడు గ్రూప్-2 అభ్యర్థులను ప్రశ్నించాల్సిన అవసరం ఏమొచ్చింది? నిజాంసాగర్, కడెం ప్రాజెక్టులను ఎవరు నిర్మించారని ఈ టైంలో అడిగించడం వెనక కుట్ర ఏంటి? తెలుగుదేశం పార్టీ, తెలుగు గౌరవం లాంటి పదాలను బలవంతంగా ప్రశ్నాపత్రంలో చొప్పించడం వెనక ఉన్న ఎజెండా ఏంటి? కావూరి సాంబశివరావు, లగడపాటి, సుబ్బరామిరెడ్డి, రాయపాటి సాంబశివరావు పేర్లు తెలంగాణ గ్రూప్-2 ప్రశ్నపత్రంలో ఎందుకు ప్రత్యక్షమయ్యాయి? ఆంధ్రా రియల్ ఎస్టేట్ కంపెనీల పేర్లను గుర్తించి జతపరచాల్సిన ఖర్మ మనకెందుకు? అసలేం జరుగుతోంది? అన్న ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

### ఏపీ వాళ్లకు కట్టబెట్టే కుట్రనా?

గ్రూప్ -2లో రెండో రోజు తెలంగాణ రాష్ట్రానికి అస్సలు సంబంధం లేని ప్రశ్నలు అడిగారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన నేతల పేర్లతో పదుల సంఖ్యలో ప్రశ్నలు అడిగించారు. సంబంధం లేని ప్రశ్నలతో తెలంగాణ అభ్యర్థులు కలవరపడ్డారు. దీని వెనుక గ్రూప్ -2 ఉద్యోగాలను ఏపీవాళ్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదన్న వాదనలొస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ చరిత్ర పేపర్లో ఉద్యమ చరిత్ర ఉండాల్సిన చోట ఆంధ్రా, తెలుగుదేశం, చంద్రబాబులకు సంబంధించిన ప్రశ్నలను చేర్చారని మండిపడుతున్నారు. మార్పు అంటే ఇదేనా? ఆనవాళ్లు చెరిపేయడం అంటే ఇదేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇందుకేనా మనం తెలంగాణ తెచ్చుకున్నదని నిలదీస్తున్నారు. ఆంధ్రా బాబు రుణం తీర్చుకునే క్రమంలో రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో మరోసారి తెలంగాణ చరిత్రను చెరిపేసే కుట్ర జరుగుతున్నదని అభ్యర్థులు మండిపడుతున్నారు.

### తెలంగాణ తల్లి విగ్రహంపై

గ్రూప్ -2 ప్రశ్నల్లో పాత తెలంగాణ తల్లి విగ్రహంపైనా ప్రశ్నలిచ్చారు. కిరీటం, వడ్డాణంలో కోహినూరు, జాకబ్ వజ్రాల ప్రతిరూపాలను కూర్చారు. మెట్టెలు కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీతో తయారు చేశారు. గద్వాల్, పోచంపల్లి చీరలను పోలిన చీరలో విగ్రహముంది. చేతిలో బోనము పట్టుకుంది అంటూ ఆప్షన్లు ఇచ్చి వీటిలో ఏది సరికాదో ఎంపిక చేయాలని ప్రశ్నను సంధించారు.

### ఎకానమీలో ఆ ప్రశ్నలేవీ?

ఉదయం నిర్వహించిన ఎకానమీ పేపర్‌లోను 2014 నుంచి 2024 వరకు గల ప్రశ్నలివ్వలేదు. ఇటీవల ఆర్‌బీఐ నివేదిక కేసీఆర్ సర్కారు పాలన పనితీరును ప్రశంసించింది. అనేక నివేదికల్లో ప్రగతిని కొనియాడింది. కానీ ఎకానమీ ప్రశ్నల్లో 2011- 2013 కాలం నాటి గణాంకాలు, వివరాలపై ప్రశ్నలిచ్చారు. కేసీఆర్ పాలనను కొనియాడటం ఇష్టంలేకే పదేండ్ల ప్రభుత్వ ప్రగతిని ప్రశ్నల్లో ప్రస్తావించలేదని అభ్యర్థులు మండిపడుతున్నారు.

## తెలంగాణ ద్రోహుల మీదనే గ్రూప్ 2లో ప్రశ్నలు..

### టీజీపీఎస్సీపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ తాజాగా నిర్వహించిన గ్రూప్-2 పేపర్‌లో ప్రశ్నలు అన్నీ తెలుగు దేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీ తదితర తెలంగాణ ద్రోహుల మీదనే ఇచ్చారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరులూదిన కేసీఆర్ మీద కానీ, ఉద్యమాన్ని అగ్రగామి శక్తిగా నడిపి తెలంగాణ సాధించిన టీఆర్ఎస్ పార్టీ మీద కానీ ప్రశ్నలు రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారని విమర్శించారు. రేవంత్ రచించిన కేసీఆర్ ఆనవాళ్ల నిర్మూలన పథకంలో ఇది మరో అడుగు అన్నమాట అని వ్యాఖ్యానించారు.

గ్రూప్ 2 ప్రశ్నపత్రాలను గాంధీ భవన్, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆత్రేయపురం పూతరేకులు తింటూ తయారు చేసినట్లుగా ఉందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. నాన్ లోకల్ కోటాలో కేవలం ఆంధ్ర అభ్యర్థులకు మాత్రమే లాభం జరగాలనే ఉద్దేశంతో ఈ పేపర్ తయారు చేశారని ఆరోపించారు. మీరెన్ని చేసినా కేసీఆర్ సంతకాన్ని చెరిపివేయలేరని తెలిపారు. తెలంగాణకు ద్రోహం చేస్తున్న వాళ్లను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

### రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి రాజ్యాంగేతర శక్తి

కుమ్రంభీం స్ఫూర్తితో లగచర్ల రైతుల పోరాటం కొనసాగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లగచర్ల పోరాటానికి దేశ రాజకీయాలను మార్చే శక్తి ఉందని పేర్కొన్నారు. విసునూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన జాతి మనది అని అన్నారు. దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా పోరాడిన థానునాయక్ ఇవాళ లగచర్ల జ్యోతిలో కనిపిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశానికి రాకుండా హైదరాబాద్ సరిహద్దుల్లో ఎంతోమందిని అడ్డుకున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కు కోసం కేటీఆర్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని తెలిపారు. యూరప్ నగరాలకు ధీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కేటీఆర్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు.

# సంధ్య థియేటర్‌కు షోకాజ్ నోటీసులు

## జారీ చేసిన సీపీ సీవీ ఆనంద్

♦సంధ్య థియేటర్ ఘటనలో కీలక పరిణామం ♦పోలీసుల షోకాజ్ నోటీసులు

♦వారం రోజులు డెడ్‌లైన్



హైదరాబాద్,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): పుష్ప 2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద డిసెంబర్ 4న తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. రాత్రి 8 గంటల తర్వాత మూవీ చూసేందుకు హీరో అల్లు అర్జున్ తన టీంతో కలిసి థియేటర్‌కు రాగా.. అభిమానులు పోటెత్తటంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో సినిమా చూసేందుకు వచ్చిన రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడగా ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తొక్కిసలాటకు బాధ్యులను చేస్తూ థియేటర్ యాజమాన్యంతో పాటుగా అల్లు అర్జున్‌లను అరెస్టు చేశారు. ప్రస్తుతం వారికి హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇక ఈ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సంధ్య థియేటర్ లైసెన్స్ విషయమై పోలీసులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లైసెన్స్ రద్దు విషయమై చిక్కడపల్లి పోలీసులు ఈ నోటీసులు ఇచ్చారు. తొక్కిసలాటలో ఒకరి మృతికి కారణమైన థియేటర్ లైసెన్స్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలన్నారు. ఈ మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వారం రోజులు గడవు ఇచ్చారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వకుంటే లైసెన్స్ రద్దు చేస్తామని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు.

ఇక హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీతేజ్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, తెలంగాణ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి ఆరోగ్యం మెరుగయ్యేందుకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బాలుడిని పరామర్శించిన అనంతరం సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం చిన్నారికి ఐసీయూలో చికిత్స అందుతోందని చెప్పారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు.

ఇక రెండ్రోజుల క్రితం హీరో అల్లు అర్జున్ సైతం చిన్నారి ఆరోగ్యం కీలక కామెంట్స్ చేశారు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనుకోకుండా జరిగిన ప్రమాదతో ఈ దుర్ఘటన చోటు చేసుకుందన్నారు. కేసు కోర్టులో ఉన్నందున ప్రత్యక్షంగా వెళ్లి పరామర్శించలేకపోతున్నానని అన్నారు.

# మొబైల్ కోసం కొట్లాట

♦ఫోన్ కోసం అన్నదమ్ముల కొట్లాట..

♦మందలించిన తండ్రి

♦అందరినీ ఏడిపించిన పెద్దోడు



హైదరాబాద్, 17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ప్రస్తుత కాలంలో మొబైల్ అనేది మనిషికి మూడో చేయిలా మారిపోయింది. ఏ పని చేయాలన్నా.. చేతిలో ఫోన్ ఉండాల్సిందే. శ్వాస తీసుకునేందుకు గాలి లేకున్నా సరే కానీ.. కాసేపు చేతిలో ఫోన్ లేకుంటే మాత్రం ఆగమాగమైపోతున్న పరిస్థితి నెలకొంది. చిన్నా పెద్దా లేడా ఏమీ లేదు.. ఉగ్గు తినే బుజ్జాయి నుంచి ఊత కర్ర పట్టుకున్న తాత వరకు మొబైల్ ఉండాల్సిందే. కొందరు పిల్లలైతే.. చేతిలో ఫోన్ ఉండి.. అందులో యూట్యూబ్ వీడియోలు ప్లే అవుతుంటేనే నోట్లోకి ముద్ద దిగుతుంది. లేకపోతే ఇంట్లో భూకంపమే. ఇక ఇంట్లో ఒకటే ఫోన్ ఉండి ఇద్దరు పిల్లలుంటే మాత్రం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రోజుకోసారైనా యుద్ధం జరగాల్సిందే. అచ్చంగా అలాంటి సంగ్రామమే ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగితే.. తండ్రి మందలించాడు. అంతే.. అలిగిన పెద్దోడు.. ఎవ్వరూ ఊహించని పని చేశాడు.

హైదరాబాద్ నగరంలోని జమ్మిగడ్డలోని బీజేనగర్ కాలనీలో వెంకటేశ్ కుటుంబంతో సహా కాపురం ఉంటున్నాడు. వెంకటేష్ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సాయికృష్ణ, సాయికుమార్, రాకేశ్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారు. అయితే.. డిసెంబర్ 14వ తేదీన ఫోన్ విషయంలో కుమారులు సాయికృష్ణ, సాయి కుమార్ మధ్య తగువు చోటుచేసుకుంది. ఇద్దరు గొడవపడుతుండటం చూసిన తండ్రి.. అన్నదమ్ములిద్దరినీ మందలించాడు.

వయసులో అందరి కంటే పెద్దవాడైన సాయికృష్ణ (18)ను తండ్రి కాస్త గట్టిగానే మందలించాడు. ఎప్పుడూ ఫోన్ చూస్తూ ఉండటం కాదు.. ఏదో ఒక పని చేసుకుని బతకాలని గట్టిగానే చెప్పాడు. దీంతో.. తీవ్ర మనస్తాపానికి గురైన సాయికృష్ణ.. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో ఎవరూ ఊహించని విధంగా.. యాసిడ్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సాయికృష్ణను హుటాహుటిన.. సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. ఆదివారం (డిసెంబర్ 15న) మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# ఆంధ్ర

# కనబడుటలేదు



పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం పరగడిచర్ల గ్రామానికి చెందిన గుడిపూడి రామతులసమ్మ వయసు(60) నిన్న మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంట్లో నుండి వెళ్లిపోయారు.పైన కనబడుతున్న వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే ఈ క్రింది నంబర్లకు సమాచారం ఇవ్వగలరని ప్రార్ధన

**రొంపిచర్ల ఎస్సై :-9440796247**
**కుటుంబసభ్యులు:-9676133187**

# మంత్రి లోకేశ్‌ను కలిసిన

## ఎమ్మెల్యే డా ||చదలవాడ అరవింద బాబు




రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో నరసరావుపేట ఎమ్మెల్యే డా||చదలవాడ అరవింద బాబు మంగళవారం కలిసి అభినందించారు.రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలందరూ హర్షిస్తున్నారని లోకేశ్‌కు వివరించారు.విద్య,ఐటీ మంత్రిగా రాష్ట్రాన్ని స్వర్ణయుగం వైపు పయనించేందుకు కృషి చేస్తున్నందుకు లోకేశ్‌ను అభినందించారు.

జాతీయ రహదారి ప్రతిపాదించిన ఎలైన్ మెంట్ మార్పుచేయాలంటూ ప్రభావిత ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసివచ్చి లోకేష్ కు వినతి

చీరాల ఓడరేవు నుంచి నకరికల్లు వరకు 167ఎ 4లైన్ల జాతీయ రహదారిని ఎన్ హెచ్ఎఐ అధికారులు 2022లో ప్రతిపాదించారు.ఇందులో అంతర్భాగంగా ఉన్న నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి 3 ఆప్షన్లు ఇచ్చారు.ఇందులో నరసరావుపేట దక్షిణం వైపు బైపాస్ కు ప్రతిపాదించిన ఆప్షన్ -3 వల్ల 5 గ్రామాల ప్రజలు పెద్దఎత్తున రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు.రైతులకు తక్కువ నష్టం కలిగించే ఆప్షన్ -2ను అమలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే డా||చదలవాడ అరవింద బాబు నేతృత్వంలో మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు.

## రేపు, ఎల్లుండి ఈ జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు




ఏపీవాసులకు అలర్ట్.. రాష్ట్రంలో మరికొన్ని రోజులు వర్షం పడే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని.. దీనికి అనుబంధంగా ఆవర్తనం విస్తరించి ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ అల్పపీడనం వచ్చే రెండు రోజుల్లో మరింత బలపడనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అనంతరం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తమిళనాడు తీరం వైపు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో వచ్చే రెండు రోజులు ఉత్తరాంధ్రలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. అల్పపీడనం ప్రభావంతో బుధవారం విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు,కృష్ణా, నెల్లూరు, వైఎస్ఆర్ జిల్లా , అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు బుధవారం.. అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే తీరం వెంబడి 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. మత్స్యకారులు సముద్రంలోకి చేపలవేటకు వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే అధికారులు చేపల వేటను నిషేధించారు. అల్పపీడనం ప్రభావంతో ఇప్పటికే రాయలసీమ జిల్లాలలో వర్షాలు కురుస్తున్నాయి. అయితే బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాలలో భారీ వర్షాలకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది.

# నాగబాబుకు

## సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ?



జనసేన నేత నాగబాబుకు సీఎం చంద్రబాబు ఏపీ కేబినెట్‌లో బెర్తు ఖరారు చేసిన విషయం తెలిసిందే. సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖను నాగబాబుకు కేటాయించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ శాఖలు జనసేన మంత్రి కందుల దుర్గేష్ వద్ద ఉన్నాయి. దుర్గేష్‌కు గనుల శాఖ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# టీడీపీ ఎమ్మెల్యేకు అస్వస్థత..



ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఎమ్మెల్యే అస్వస్థతకు గురయ్యారు.. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. నంద్యాల జిల్లా డోన్ టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అస్వస్థకు గురయ్యారు.. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ను కర్నూలులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.. అక్కడ ప్రాథమిక చికిత్స తర్వాత.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకొస్తున్నారు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఉపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా అస్వస్థతకు గురైనట్టు తెలుస్తోంది. అయితే సూర్యప్రకాష్ రెడ్డి ఆరోగ్యం నిలకడగానే ఉందని.. ముందస్తు జాగ్రత్తగానే హైదరాబాద్ తరలించినట్లు తెలుస్తోంది.

కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రస్తుతం డోన్ నియోజకవర్గ పర్యటనలో ఉన్నారు.. రెండు రోజులుగా వివిధ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం బేతంచర్లలో జరిగిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే ఆదివారం రాత్రి బేతంచర్లలోని హెూసన్నా చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి కుమారుడు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయ కాంగ్రెస్ పార్టీలో చేరారు.. 1991, 2004, 2009లో ఎంపీగా విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వంలో రైల్వే శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితి మొత్తం మారిపోయింది.. కోట్ల కుటుంబం హవా తగ్గింది. 2014 ఎన్నికల్లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి ఓడిపోయారు.. ఆ తర్వాత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి కర్నూలు ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత టీడీపీ బలోపేతం కోసం పనిచేశారు.. అయితే 2024 ఎన్నికల్లో మళ్లీ కర్నూలు నుంచి పోటీ చేస్తారని భావించారు. కానీ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి డోన్ నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యే టికెట్ దక్కగా.. విజయం సాధించారు.

## టీడీపీ నేతల హత్యలకు ప్లాన్లు వేస్తున్న అప్పల్రాజు ?




సిక్కోలు జిల్లాలో రాజకీయం ఎప్పుడూ వయొలెంట్ గా ఉండదు. కానీ డాక్టర్ సీదిరి అప్పల్రాజు వైసీపీ తరపున ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఆయన తన ఫ్యాక్షన్ లీడర్ ఉండరన్నట్లుగా రెచ్చిపోతున్నారు. మీసాలు పెంచని ఈ రాజకీయ నాయకుడు.. తన పదవి కాలంలో చేసిన అరాచకం అంతా ఇంతా కాదు. ఇప్పుడు పదవి పోయిన తర్వాత ఆయన హత్యారాజకీయాలు చేయిస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.తాజాగా పలాసలో ఓ బీహారీ గ్యాంగ్ ను పట్టుకున్నారు. ఆ గ్యాంగ్ అక్కడ ఓ టీడీపీ లీడర్ ను హత్య చేసేందుకు వచ్చింది. రూ. పది లక్షల సుపారీకి మాట్లాడుకుని.. పలాస పట్టణ టీడీపీ అధ్యక్షుడిని చంపేందుకు వచ్చారు. విషయం బయటపడటంతో వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారు ఎక్కడ తన పేరు చెబుతారోనని భయపడిన సీదిరి అప్పలరాజు వారిని విడిచిపెట్టాలని ధర్నాకు దిగారు.ఇదేమి రాజకీయ ధర్నా కేసు కాదు. సుపారీ మర్డర్ ప్రయత్నం. దీన్ని అంత తేలికగా పోలీసులు వదిలి పెట్టే అవకాశం లేదు. అందుకే విషయం బయటపడిన తర్వాత స్వయంగా ఎస్పీకి కూడా పలాస వచ్చారు. బీహారీ ముఠా నుంచి వివరాలు తెలుసుకున్నారు. అచ్చెన్నాయుడు కూడా పోలీసులకు ఫోన్ చేశారు. హత్యారాజకీయాలు చేస్తే సహించేదిలేదని.. ఈ కుట్రలో ఎవరు ఉన్నా వదిలి పెట్టవద్దని ఆయన స్పష్టం చేశారు.

సీదిరి అప్పలరాజే తన అనుచరుల ద్వారా ఈ ప్లాన్ వేయించారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై పోలీసులు తేల్చనున్నారు.

## నాగర్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రేసులో తెదెపా సీనియర్ నాయకులు పులిమి రామిరెడ్డి?

## వారంలో నోటిఫికేషన్ విడుదల!



మానవ నిర్మిత మణిహారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ప్రస్తుతం ప్రతిష్టాత్మకంగా మారింది. నోటిఫికేషన్ మరో వారంలో విడుదల కానున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాకు చెందిన టిడిపి పార్టీ సీనియర్ నాయకులు పులిమి రామిరెడ్డికి రేసు లో ఉన్నాడు కుడి కాలువ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 48 ప్రాజెక్టు కమిటీలు పని చేస్తున్నాయి. పల్నాడుతో పాటు ప్రకాశం జిల్లా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో చైర్మన్ ఎంపిక ఉండనున్నది. 48 కమిటిలలో 30వరకు గుంటూరు జిల్లా పరిధిలో మరో 18 ప్రకాశంలోనూ ఉన్నాయి. ఇటీవల సాగునీటి కమిటీల ఎన్నికలను అధికారులు పూర్తి చేసారు.మంగళవారం డిస్ట్రిబ్యూటరీ కమిటీలఎన్నికలు పూర్తి కానున్నాయి. తర్వాత ప్రాజెక్టు చైర్మన్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు సిద్ధం అవుతున్నారు. కాగా 20సంవత్సరాల క్రితం కాంగ్రెస్ హాయంలో నరసరావుపేట నియోజకవర్గానికి చెందిన గడిపూడి నరసింహారావును చైర్మన్ పదవి వరించింది. ప్రస్తుతం ఈ అవకాశం పల్నాడు వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

# ఆర్టీసీ ఉద్యోగులకు తీపికబురు..




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్ వినిపించింది. ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టిన ఏపీ ప్రభుత్వం.. అందులో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు నైటౌట్ అలవెన్సులు మంజూరు చేసింది.ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రోజుకు రూ.150 చొప్పున నైటౌట్ అలవెన్సులు ఇచ్చేలా జీవో ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ధన్యవాదాలు తెలియజేశాయి. ఇదే సమయంలో తమకు రావాల్సిన అరియర్స్ కూడా ఇవ్వాలంటూ ఏపీ ప్రభుత్వాన్ని కోరారు.

మరోవైపు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జీవో 114లో అలవెన్సుల ప్రస్తావన లేకపోవటంతో ఆర్టీసీ ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఆర్టీసీ సిబ్బందికి నష్టం వాటిల్లింది. ఈ విషయం గురించి ఆర్టీసీ సంఘాలు పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాయి. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలైన ఎన్ఎంయూ, ఈయూ, %ాజౌఖీ% , కార్మిక పరిషత్ నేతలు సీఎం నారా చంద్రబాబు నాయుడును కలిసి ఈ విషాయాన్ని ప్రస్తావించారు. అలాగే లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోలో నైటౌట్ అలవెన్స్ సహా ఇతర అలవెన్సులు ఇవ్వాలంటూ సవరించి ఫైల్ రెడీ చేశారు. అనంతరం ఆర్థిక శాఖ ఆమోదానికి పంపారు.

ఆర్థిక శాఖ ఈ దస్త్రాన్ని ఆమోదించటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైటౌట్ అలవెన్సులు మంజూరు చేస్తూ మంగళవారం జీవో జారీ చేసింది. రోజుకు 150 రూపాయల చొప్పున నైటౌట్ అలవెన్సులు మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా దృష్టిపెట్టాలని కోరుతున్నాయి. ముఖ్యంగా తమకు రావాల్సిన అరియర్స్ మంజూరు చేయాలని కోరుతున్నాయి. ఈ దిశగానూ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

# అమరావతిపై పొంగులేటి హాట్ కామెంట్స్..



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలకు టీడీపీ కౌంటర్ ఇచ్చింది. అమరావతి మునిగిపోతుందనే భయంతో ఇన్వెస్టర్లు అక్కడకు వెళ్లరంటూ మీడియా చిట్‌చాట్‌లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిపై టీడీపీ కౌంటర్ ఇచ్చింది. టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ఏపీ రాజధాని అమరావతి 'న భూతో న భవిష్యతి' అనే విధంగా అభివృద్ధి చెందుతుందన్న ధూళిపాళ్ల నరేంద్ర.. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక అమరావతితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయంటూ ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు.

ఇక ఈ ట్వీట్‌లో అమరావతి గురించి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం, ఉద్దేశ్యపూర్వకం అంటూ ధూళిపాళ్ల నరేంద్ర మండిపడ్డారు. వైఎస్ జగన్ అనుచరులు చెప్పే మాటలనే పొంగులేటి చెప్తున్నారన్న నరేంద్ర.. వైఎస్ జగన్ స్నేహం తాలూకు వాసనలు పొంగులేటికి ఇంకా పోనట్లు ఉన్నాయంటూ సెటైర్లు వేశారు. టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లో ఏపీకి వచ్చిన పెట్టుబడులే చంద్రబాబు విజనరీకి.. అమరావతి అభివృద్ధి నిదర్శనమని ధూళిపాళ్ల నరేంద్ర ట్వీట్ చేశారు.

మరోవైపు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ అమరావతికి పోతోందనేది కేవలం ప్రచారం మాత్రమేనని అన్నారు. ఏపీలో చంద్రబాబు రాగానే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందనేది తప్పుడు ప్రచారమన్న పొంగులేటి.. అమరావతిలో వరదల కారణంగా అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారులు భయపడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. దీంతో అమరావతి కంటే.. హైదరాబాద్, బెంగుళూరు వంటి చోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయని మీడియాతో చిట్ చాట్ సందర్భంగా పొంగులేటి అన్నారు.

ఈ క్రమంలోనే పొంగులేటి వ్యాఖ్యలను ఖండించిన ధూళిపాళ్ల నరేంద్ర.. వైఎస్ జగన్ స్నేహం తాలూకు వాసనలు పోలేదంటూ ఎద్దేవా చేశారు. ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన పెట్టుబడులు చూస్తే అమరావతి అభివృద్ధి అర్థం అవుతుందంటూ టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చురకలు అంటించారు.

# బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసిన ఘటనలను ప్రస్తావిస్తూ అప్పటి ఫోటోలు చూపించారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. అంతకు ముందు క్వశ్చన్ అవర్‌లో అప్పులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే



హరీశ్‌రావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం జరిగింది. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షా 27 వేల 208 కోట్ల అప్పు చేసిందన్నారు హరీశ్‌రావు. ఎఫ్ఆర్‌బీఎం కింద 51 వేల 277 కోట్ల అప్పు తెచ్చిందన్నారు. అప్పుల పరంపరం ఇలానే కొనసాగితే 5 ఏళ్లలో అయ్యే రూ. 6 లక్షల 36 వేల కోట్ల అప్పు అవుతుందన్నారు హరీశ్‌రావు. తాము బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామన్నారు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క. ఈ విషయంపై ప్రత్యేక డిబేట్ పెడదామన్నారు.

అప్పులపై ఆర్థిక మంత్రి సభను ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు హరీశ్‌రావు. అప్పులు, వడ్డీలపై హరీశ్ అబద్ధాలు ఆడుతున్నారంటూ కౌంటర్ ఇచ్చారు భట్టి విక్రమార్క. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది అసెంబ్లీ. స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లుతో పాటు యూనివర్సిటీల చట్టసవరణ బిల్లు.. జీఎస్టీ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర బీజేపీ నిరసనకు దిగింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేసింది. కౌలు రైతులకు రుణాలు, పట్టాలు ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేసింది.

## అసెంబ్లీలో ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారం:

ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌తోపాటు బాధ్యులపై చర్యలుంటాయన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు.. తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెంచాయి. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ ఇచ్చిన అనుమతిని ఏసీబీకి పంపాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. ఏసీబీ విచారణలో కేటీఆర్ సమాధానాలు చెప్పాల్సిందేనన్నారు పొంగులేటి. మంత్రి పొంగులేటి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. వారికీ వీరికి కాదు అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు సమాధానం చెప్పడానికి తాను సిద్ధమన్నారు కేటీఆర్. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు కేటీఆర్ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందన్నారు జగదీశ్ రెడ్డి. ఈ– కార్ రేసింగ్ వ్యవహారంలో సభలో చర్చపెడితే కేటీఆర్ సమాధానం చెప్తారన్నారాయన. ఈ సందర్భంగా పొంగులేటి కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు ఎమ్మెల్యే వివేకానంద. బీఆర్ఎస్ లీడర్ల కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేతల అరెస్టులు తప్పవని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. అయితే కక్ష సాధింపు చర్యలను ప్రజలను హర్షించరంటున్నారు బీఆర్ఎస్ నేతలు.

## రైతులు జైల్లో మగ్గుతుంటే రేవంత్ రెడ్డి, మంత్రుల్లో రాక్షసానందం - బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి

నెలకు పైగా జైల్లో మగ్గుతున్న లగచర్ల రైతుల అంశంపై బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ బాట పట్టింది. ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పట్టుబట్టగా స్పీకర్ పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనగా దిగారు. నల్లచొక్కాలు ధరించి.. చేతులకు బేడీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 'రైతులకు బేడీలా..సీఎం, మంత్రులు జల్సాలా' అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. అసెంబ్లీ లోపల.. బయట గులాబీ పార్టీ సభ్యులు నిరసన చేపట్టడంతో లగచర్ల రైతులపై ప్రభుత్వ దాష్టీక చర్య ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

లగచర్ల రైతులకు బేడీలు వేయడంపై ప్రభుత్వం చర్చకు అవకాశం ఇవ్వకపోవడంతో అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, అనిల్ జాదవ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాష్టీక చర్యలను తప్పుబట్టారు. రేవంత్ రెడ్డికి సవాళ్ల మీద సవాళ్లు చేశారు. ప్రతి అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించారు.

'లగచర్ల ఘటనపై చర్చకు రెండు రోజులుగా బీఆర్ఎస్ పట్టుబడినా ప్రభుత్వం పారిపోయింది. సభా నియమాలపై నీతులు చెబుతూ ప్రభుత్వమే ఉల్లంఘించింది. పాలకపక్షం ప్లకార్డులు లోపలకి తెస్తే స్పీకర్ ఎలా అనుమతించారు?' అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. నిరసనల మధ్య బిల్లులు ఆమోదించుకున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాన్ని ఎదుర్కునే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని చెప్పారు. 'పర్యాటక రంగంపై చర్చకు తొందర ఏముంది?' అని నిలదీశారు.

లగచర్ల రైతులు జైల్లో మగ్గుతుంటే సీఎం మంత్రులు రాక్షసానందం పొందుతున్నారని ఎమ్మెల్యేలు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, అనిల్ జాదవ్ తెలిపారు. రైతులు కన్నీరు పెడుతుంటే రేవంత్ రెడ్డి, మంత్రులు జల్సాలో మునిగి తేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల పై ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రహసనంగా మార్చేసిందని మండిపడ్డారు. అన్ని వ్యవస్థలను రేవంత్ నిర్వీర్యం చేశారని చెప్పారు.

'రేవంత్ రెడ్డి వార్తలను లీకులు ఇచ్చి బతుకుతున్నారు. కేసులు.. అరెస్టులు అంటూ నాలుగు గోడల మధ్య ఉండి రేవంత్ అడ్డగోలు వార్తలు రాయిస్తున్నారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి చర్చకు రావాలి. చర్చ అంటేనే రేవంత్ మొహం చాటేస్తున్నారు. అసెంబ్లీకి వచ్చే మొహం లేదు' అని సీనియర్ నాయకుడు జగదీశ్ రెడ్డి విమర్శలు చేశారు. ఫార్ములా వన్ మీద దమ్ముంటే చర్చ పెట్టాలి అని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ మోసాలపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. దమ్ముంటే శాసనసభ ను పదిహేను రోజులు నడపాలని ఛాలెంజ్ చేశారు.

### ప్రజాక్షేత్రంలో నొక్క లేరు

'బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతి పనిని చర్చిద్దాం. అసెంబ్లీలో మా గొంతు నొక్కవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో నొక్క లేరు' అని పేర్కొన్నారు. 'రేవంత్ రెడ్డి దొంగ రాతలు.. తప్పుడు రాతలు పత్రికల్లో రాయిస్తున్నారు. నేరుగా మమ్మల్ని ఎదుర్కునే దైర్యం లేదు' అని జగదీశ్ రెడ్డితోపాటు మిగతా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు తెలిపారు.

## ఎస్టాబ్లిష్మెంట్ జీవో జారీ చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలి



హైదరాబాద్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):తెలంగాణ శాసనమండలి లో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అన్ రెసిడెన్షియల్ లా కాలేజ్ ఫర్ మెన్– 2021 సంవత్సరంలో గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ చొరవతో హరీష్ రావు ,మరీ ప్రత్యేకంగా నేను గిరిజన శాఖ మంత్రి గా ఉన్నపుడు గిరిజనులకు మంచి న్యాయవిద్యను అందించాలని సంగారెడ్డి లో మంజూరు చేసిన గిరిజన పురుషుల కోసం ప్రత్యేకంగా న్యాయవిద్య కోసం ఎంపిక చేయబడిన విద్యాసంస్థ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) ఆమోదం కింద పనిచేస్తున్న అనేక అనుబంధ న్యాయ కళాశాలల్లో సంగారెడ్డి ఆధారిత కళాశాల ఒకటి స్థాపించడం జరిగింది, ఇప్పుడు అక్కడ చదువుతున్న విద్యార్థులు 5 సంవత్సరాలు పూర్తి చేసుకొని పట్టా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థుల దృష్ట్యా,వారు సర్టిఫికెట్ పొందాలన్న, పై చదువులకై ఎల్.ఎల్.ఎమ్ చేయాలన్న ప్రభుత్వం దగ్గర నుండి జీవో రావాల్సిన అవసరం ఉంది కాబట్టి దయచేసి గిరిజన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు కాబట్టి వీలైనంత త్వరగా ఎస్టాబ్లిష్మెంట్ జీవో జారీ చేసి,బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)వారికి పంపించి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వన్నీ డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు

## స్వశక్తితోనే క్రీడలలో రాణించాలి

ములుగు జిల్లా ప్రతినిధి ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):విద్యార్థినీ, విద్యార్థులు గ్రామస్థాయి క్రీడల నుండి జాతీయస్థాయి క్రీడల వరకు ఎదగాలని, స్వశక్తితోనే క్రీడలలో రాణించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.మంగళవారం ములుగు మండలంలోని జాకారం గ్రామంలో గల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, జిల్లా క్రీడల అధికారి తుల రవితో కలిసి సీఎం కప్ - 2024 జిల్లా స్థాయి క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.కలెక్టర్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరికి డబ్బే ప్రధానం కాదని ఆరోగ్యం ముఖ్యమని, క్రీడా నైపుణ్యం స్వంత శక్తితో వస్తుందని అన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయి క్రీడలలో రాణించి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావాలని, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా యంత్రాంగం మంచి గుర్తింపునిస్తుందని తెలిపారు. జిల్లా స్థాయి కబడ్డీ, హ్యాండ్ బాల్, అథ్లెటిక్, యోగ , కిక్ బాక్సింగ్ క్రీడల్లో పాల్గొంటున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. క్రీడాకారుల కోసం ఎంత ఖర్చయినా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, క్రీడాకారులు పదిమందికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రతిభ కనపరచి జిల్లా స్థాయికి వచ్చిన క్రీడాకారులు అదే ఉత్సాహంతో ఇక్కడ నుండి రాష్ట్ర స్థాయి కి వెళ్లలని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ మాట్లాడుతూ క్రీడాల వల్ల దేహదారుఢ్యం, క్రమశిక్షణ ఏర్పడుతుందను, ఈ క్రీడాలు అందరు ఉత్సాహంగా పాల్గొన్నరని, క్రీడలో గెలుపు ఓటమిలు సహజం ఓడినా వాళ్లు కుంగి పోకుండా గెలుపు కై ముందుకు సాగాలన్నారు క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారు - కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ సమావేశాలను 15 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని సమస్యలపై చర్చించేందుకు సిద్ధమని తెలిపారు. అవినీతి ఆరోపణలపై కూడా చర్చకు రెడీ అని పేర్కొన్నారు. ఈ కార్ రేస్ అంశంపై కూడా చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. దమ్ముంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

లగచర్ల రైతులనే కాదు.. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కూడా అరెస్టు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే పీడీ యాక్ట్ పెడతామని బెదిరిస్తున్నారని అన్నారు. కొడంగల్ రైతులు కూడా రేవంత్ రెడ్డికి ఓటేశామని బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. పట్నం నరేందర్ రెడ్డి, లగచర్ల రైతులను అరెస్టు చేసి 35 రోజులైందని తెలిపారు. నాంపల్లి కోర్టులో లగచర్ల రైతులు, పట్నం నరేందర్ రెడ్డి కేసులపై వాదనలు ముగిశాయని చెప్పారు. మనకు అనుకూలంగా తీర్పు రాకుంటే హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా వెళదామని స్పష్టం చేశారు. లగచర్ల రైతులకు న్యాయం జరిగేవరకు సర్కార్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని తుక్కుతుక్కుగా ఓడించే సత్తా పట్నం నరేందర్ రెడ్డికి ఉందని కేటీఆర్ తెలిపారు. నరేందర్ రెడ్డి గుండె ధైర్యానికి సెల్యూట్ చేయాలని అన్నారు.

రేవంత్ రెడ్డి ఏడాది కింద రాష్ట్రమంతటా తిరిగి దొంగ హామీలు ఇచ్చారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై చర్చకు ఎక్కడికైనా సిద్ధమని స్పష్టం చేశారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఎక్కడైనా పూర్తయ్యిందా అని ప్రశ్నించారు. దీనిపై చర్చకు వస్తారా అని సవాలు విసిరారు. ఒక్క ఊళ్లో అయినా వంద శాతం రైతు రుణమాఫీ చేసినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు. ఏడాది కడుపు కట్టుకుంటే 49 కోట్లు మాఫీ చేస్తామని రేవంత్ బీరాలు పలికారని అన్నారు. కానీ ఇప్పటివరకు రైతుల ఖాతాలో 13 కోట్లకు మించి పడలేదని చెప్పారు. వానాకాలంలో రైతుభరోసాను ఎగ్గొట్టిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఇచ్చిన రూ.10వేల రైతుబంధు కూడా ఇవ్వడం లేదని అన్నారు.

రాహుల్ గాంధీ నుంచి మొదలుపెడితే కాంగ్రెస్ నేతలు చెప్పినవన్నీ అబద్ధాలే అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించేందుకు ఏదైనా



ఉపాయం ఉందా అని ప్రజలంతా అడుగుతున్నారని తెలిపారు. నీలి రంగు నక్కను ఎప్పుడు వదిలించుకుందామా అని తెలంగాణ సమాజం ఎదురుచూస్తోందని తెలిపారు. రోషం ఉన్నవాడైతే ప్రజల తిట్లకు రేవంత్ రెడ్డి ఎప్పుడో చచ్చిపోతుండే అని ఎద్దేవా చేశారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగస్తులను తక్షణమే పే స్కేల్ ఇచ్చి రెగ్యులర్ చేయాలి



ములుగు జిల్లా ప్రతినిధి ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో విద్యాశాఖకు అనుబంధంగా ఉన్న సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు మంగళవారం ములుగు జిల్లా కేంద్రం యందు ఎనిమిదవ రోజు నిరవధిక సమ్మె కార్యక్రమంలో భాగంగా బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు సర్వోతోముఖాభివృద్ధి చెందడానికి క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగస్తులను తక్షణమే పే స్కేల్ ఇచ్చి రెగ్యులర్ చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్య బోధనలు చేస్తున్న ఉద్యోగస్తులు రోడ్డుపైకి వచ్చి నిలవధిక సమ్మె కార్యక్రమాలు చేస్తుంటే భావి భారత పౌరులు ఏ విధంగా తయారవుతారని జిల్లా అధ్యక్షులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున తక్షణమే ఫే స్కేల్ ఇచ్చి రెగ్యులర్ చేయాలని తెలియజేస్తూ రేపటిలోగా అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో ఇవ్వాలని లేని ఎడల మా యొక్క నిరవధిక సమ్మె కార్యక్రమాలు రోజురోజుకు ఉధృతం చేస్తామని తెలుపుతూ వారం రోజులు అయినప్పటికీ కూడా ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసం కాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చల్లా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడియా,ఉపాధ్యక్షులు ఎండీ ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేష్ సమన్వయకర్తలు స్వాతి, అనిత, ప్రవీణ్, విష్ణు, తిరుమల, స్వప్నలత, ప్రవీణ్, చిరంజీవి, విజయ్, దేవేందర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మూడు కీలక బిల్లులు ఆమోదం..

మొదటి పేజీ తరువాయి

సభలో ఎలాంటి చర్చ లేకుండానే ఈ మూడు బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర పర్యాటక విధానంపై కూడా కొంతసేపు చర్చ జరిగింది. ఆ తర్వాత సభ బుధావారానికి వాయిదా పడింది. ఇదిలాఉండగా.. సభను బీఆర్ఎస్ ఎమ్మెల్యే తప్పుదోవ పట్టిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్పీకర్ పర్మిషన్‌తో అప్పులపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశాల్లో భాగంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రశ్నోత్తరాలు నిర్వహించగా.. హరీశ్‌రావు, భట్టి విక్రమార్క మధ్య వాదనలు కొనసాగాయి.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.1.27 కోట్లు అప్పులు చేసిందని హరీశ్ రావు ఆరోపించారు. వీళ్ల ఐదేళ్ల పాలన పూర్తయ్యేసరికి అప్పులు 6.36 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అప్పులపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారాలు చేశారంటూ ధ్వజమెత్తారు. తమ హయాంలో రూ.4,17,496 కోట్లు మాత్రమే అప్పు ఉందని .. కానీ రూ.7లక్షల కోట్లకు పైగా మేము అప్పులు చేశామంటూ ప్రచారం చేశారని ఆరోపించారు.

ఆ తర్వాత భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని సభలోనే శ్వేతపత్రం కూడా విడుదల చేశామని తెలిపారు. తాము ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి అప్పులు చేయడం లేదని అన్నారు. స్పీకర్ పర్మిషన్‌తో ఈ విషయంపై చర్చించేందుకు సిద్ధమని స్పష్టం చేశారు.



## లగుచర్ల గిరిజన రైతులని వెంటనే విడుదల చేయాలి, మాజీ ఎమ్మెల్యే



వరంగల్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):వరంగల్ తూర్పు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ కార్యకర్తలతో కలిసి లగుచర్ల గిరిజన రైతులని వెంటనే విడుదల చేయాలని మంగళవారం కాశిబుగ్గ జంక్షన్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ అధ్యక్షులు యండి ఇక్బాల్,19వ డివిజన్ అధ్యక్షుడు చిలువేరు పవన్ జక్కీ యుగంధర్ ఆడెపు కార్తీక్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్య క్రాంతి



## ముఖంపై ఉన్న మచ్చలు పోవాలా అయితే ఇలా చేయండి



హెల్త్ న్యూస్,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ) : ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలను పోగొట్టుకునేందుకు చాలా మంది అనేక రకాల పద్ధతులను పాటిస్తుంటారు. ఇందుకు గాను ఖరీదైన సౌందర్య సాధన ఉత్పత్తులను ఉపయోగిస్తుంటారు. అయితే వీటిని దీర్ఘకాలంలో ఉపయోగించడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వీటి వల్ల మన ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. ఆరోగ్యం దెబ్బ తింటుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కనుక కాస్మొటిక్స్‌ను వీలైనంత తక్కువ వాడాలి. లేదా పూర్తిగా వాడడం మానేస్తే మంచిది. అయితే మరి ముఖంపై ఉండే మచ్చలను ఎలా తొలగించాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. అందుకు గాను పలు సహజసిద్ధమైన చిట్కాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఆలుగడ్డలతో..**

ముఖంపై ఏర్పడే మచ్చలను తొలగించడంలో ఆలుగడ్డలు ఎంతగానో దోహదపడతాయి. ఆలుగడ్డలను కట్ చేసి మచ్చలున్న చోట పెట్టి కాసేపు వదిలేయాలి. తరువాత గోరు వెచ్చని నీటితో శుభ్రం చేయాలి. ఆలుగడ్డను గుజ్జుగా చేసి అందులో ఒక టీస్పూన్ తేనె కలిపి మచ్చలు ఉన్న చోట రాసి పావు గంట వదిలేయాలి. తరువాత నీటితో కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖంపై ఉండే మచ్చలు పోతాయి. అలాగే కాస్త మజ్జిగ, రెండు టీస్పూన్ల టమాటా జ్యూస్‌ను కలిపి ముఖానికి రాసుకోవాలి. పావు గంట తరువాత శుభ్రం చేయాలి. వారంలో 2 సార్లు ఇలా చేస్తే ఫలితం ఉంటుంది.

**పెరుగు, నిమ్మరసం..**

ఒక టేబుల్ స్పూన్ పెరుగులో కొద్దిగా నిమ్మరసం వేసి మచ్చలు ఉన్న చోట అప్లై చేసినా స్కిన్ టోన్ బ్యాలెన్స్ అవుతుంది. ఓట్స్‌ను గ్రైండ్ చేసి రెండు టీస్పూన్ల నిమ్మరసం వేసి పేస్టులా చేసి ముఖంపై మర్దనా చేస్తుండాలి. పావు గంట తరువాత నీటితో కడిగేయాలి. వారంలో ఒకటి లేదా రెండు సార్లు ఇలా చేస్తే ఫలితం ఉంటుంది. అలాగే 2 డేబుల్ స్పూన్ల పాలలో ఒక టీస్పూన్ తేనె వేసి దూదితో మచ్చలు ఉన్న చోట అప్లై చేయాలి. 10 నిమిషాల తరువాత క్లీన్ చేయాలి. ఈ చిట్కా మచ్చలను త్వరగా పోగొడుతుంది. పాలలో ఒక టీస్పూన్ పసుపు వేసి ఉపయోగించినా ఫలితం ఉంటుంది.

**కలబంద గుజ్జుతో..**

కలబంద గుజ్జును వేళ్లతో నెమ్మదిగా మచ్చలు ఉన్న చోట మసాజ్‌లా చేసుకోవాలి. రోజుకు 2 సార్లు ఇలా చేస్తే కొన్ని వారాల్లోనే ఫలితం ఉంటుంది. అలాగే బొప్పాయిని గుజ్జుగా చేసి ఒక టీస్పూన్ నిమ్మరసం వేసి ముఖానికి రాసుకోవాలి. పావు గంట తరువాత కడిగేయాలి. మచ్చలు ఉన్న చోట రోజుకు రెండు మూడు సార్లు ఉల్లిపాయత రబ్ చేస్తే ఫలితం ఉంటుంది. ఇలా ఈ సహజసిద్ధమైన చిట్కాలను పాటించడం వల్ల మీ ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు పోతాయి.

## గొంతు నొప్పి మిమ్మల్ని వేధిస్తోందా



హెల్త్ న్యూస్,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): చలికాలంలో వేధించే ఆరోగ్య సమస్యల్లో గొంతు నొప్పి ఒకటి. చలి వాతావరణంతోపాటు హానికారక బ్యాక్టీరియా, వైరస్‌లవల్ల గొంతు ఇన్‌ఫెక్షన్ వస్తుంది. దీనివల్ల అన్నం తినడం, నీళ్లు తాగడం కూడా కష్టమవుతుంది. అయితే.. వంటింట్లోనే దొరికే పసుపు, మిరియాలు, లవంగాలతోనే గొంతు నొప్పికి చెక్ పెట్టవచ్చు.పసుపు–పాలు.. గొంతు సమస్యలకు అద్భుతమైన పరిష్కారం. ఈ రెండిటినీ కలిపి తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. గ్లాసు గోరువెచ్చని పాలలో రెండు చిటికెల పసుపును కలిపి తాగితే.. గొంతు ఇన్‌ఫెక్షన్లు ధరిచేరవు.లవంగాలు.. శక్తిమంతమైన యాంటి సెప్టిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇందులో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం.. గొంతులోని బ్యాక్టీరియాను చంపేస్తుంది.మిరియాల్లో యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఎక్కువ. ఇందులో లభించే పైపెరిన్ అనే సమ్మేళనం.. గొంతులో వాపు, మంటను తగ్గించడంలోనూ సాయపడుతుంది. ఇందులోని యాంటి బ్యాక్టీరియల్ గుణాలు.. ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే బాక్టీరియాను నాశనం చేస్తాయి.ఒక టేబుల్ స్పూన్ తేనెలో చిటికెడు నల్ల మిరియాల పొడి కలిపి తీసుకుంటే.. గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు కలిపి, ప్రతిరోజూ ఉదయం పుక్కిలిస్తే.. గొంతునొప్పి దూరమవుతుంది.ఒక టీస్పూన్ తేనెలో రెండుమూడు తులసి ఆకుల రసాన్ని పిండి.. తాగినా గొంతునొప్పి తగ్గుతుంది.

## క్యాల్షియం కావాలంటే ఇవి తినండి




హెల్త్ న్యూస్,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): క్యాల్షియం మన ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచడంలో సహాయం చేస్తుంది. కండరాలు, కణాలు, నాడులు సరిగ్గా పనిచేసేందుకు కూడా ఇది దోహదపడుతుంది. కనుకనే మనం రోజుకు కనీసం 1000 మిల్లీగ్రాముల మేర క్యాల్షియంను తీసుకోవాల్సి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్యాల్షియం మనకు ప్రధానంగా పాలు, పాల సంబంధ పదార్థాల నుంచి వస్తుంది. అయితే పాలను తాగడం ఇష్టం లేని వారు, లాక్టోజ్ పడనివారు ఆహారంలో పాలకు బదులుగా క్యాల్షియం కోసం కొన్ని ఆహారాలను తీసుకోవచ్చు. దీంతో క్యాల్షియంతోపాటు ఇతర విటమిన్లు, మినరల్స్ కూడా లభిస్తాయి.

**అంజీర్ పండ్లు..**

అంజీర్ పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లను అర కప్పు తింటే చాలు మనకు సుమారుగా 121 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. ఈ పండ్లలో పొటాషియం, ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి కండరాల పనితీరును, గుండె కొట్టుకోవడాన్ని నియంత్రించడం వంటి పలు పనుల్లో సహాయం చేస్తాయి. అంజీర్ పండ్ల ద్వారా మెగ్నీషియం కూడా మనకు లభిస్తుంది. దీని వల్ల రాత్రిపూట కాలి పక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. కండరాల ఆరోగ్యం మెరుగు పడుతుంది.

**నారింజ..**

ఒక పెద్ద నారింజ పండులో సుమారుగా 74 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. ఈ పండ్లలో విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. క్యాలరీలు కూడా తక్కువగానే లభిస్తాయి. కనుక అధిక బరువు తగ్గాలనుకునే వారు కూడా నారింజ పండ్లను తినవచ్చు. దీంతోపాటు ఎముకలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి.

**చేపలు..**

చేపలను 120 గ్రాములు తీసుకుంటే 351 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. మెదడు, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే విటమిన్ బి12 కూడా మనకు చేపల ద్వారా ఎక్కువగానే లభిస్తుంది. క్యాల్షియం ఎముకల్లోకి ప్రవేశించడానికి తోడ్పడే విటమిన్ డి సైతం చేపల ద్వారా మనకు లభిస్తుంది. కనుక చేపలను వారంల కనీసం 2 సార్లు తింటే ఎంతో మేలు జరుగుతుంది.

**బెండకాయ..**

బెండకాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. వీటిని ఒక కప్పు తింటే మనకు సుమారుగా 82 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. బెండకాయల్లో విటమిన్ బి6, ఫోలేట్ వంటి పోషకాలు కూడా ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

**టోఫు..**

ప్రోటీన్‌తోపాటు క్యాల్షియంతో నిండిన టోఫు శాకాహారులకు ఎంతగానో మేలు చేస్తుంది. సగం కప్పు టోఫులో 434 మిల్లీగ్రాముల క్యాల్షియం ఉంటుంది. కనుక క్యాల్షియంకు టోఫు చక్కని వనరు అని చెప్పవచ్చు. అలాగే బాదంపప్పులను తినడం వల్ల కూడా మనకు క్యాల్షియం లభిస్తుంది. ఆరోగ్యానికి మేలు చేసే నట్స్‌లో బాదం పప్పు ఒకటి. 30 గ్రాముల బాదంపప్పును తింటే సుమారుగా 75 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. వీటిని పొట్టు తీసి తినడం మంచిది. బాదంపప్పులో విటమిన్ ఇ, పొటాషియం కూడా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల ఎముకలను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుకోవచ్చు.

KR TV మన క్రాంతి
బుధవారం 18 డిసెంబర్ 2024

# టాప్ 3 లో స్మృతి మంధన




స్పోర్ట్స్ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే, టీ20 ర్యాంకింగ్స్లో భారత మహిళా జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధన అదరగొట్టింది. వన్డే, టీ20 ర్యాంకింగ్స్లో మంధన టాప్-3లోకి ప్రవేశించింది. వన్డే ర్యాంకింగ్స్లో మూడు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి చేరిన మంధన.. టీ20 ర్యాంకింగ్స్లో ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడో స్థానానికి చేరింది. ఆస్ట్రేలియా, వెస్టిండీస్ సిరీస్లో ప్రదర్శనల ఆధారంగా మంధన ర్యాంక్లు మెరుగుపడ్డాయి. మూడు మ్యాచ్ల సిరీస్లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో మంధన సూపర్ సెంచరీ (105) చేసింది. తాజాగా స్వదేశంలో వెస్టిండీస్తో జరిగిన తొలి టీ20లో మెరుపు అర్ధ సెంచరీ (54) సాధించింది. మరోవైపు వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్లో ఇంగ్లండ్ ఓపెనర్ ట్యామీ బేమౌంట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 11వ స్థానానికి చేరగా.. భారత బ్యాటర్ హర్లీన్ డియోల్ తొమ్మిది స్థానాలు మెరుగుపర్చుకుని 64వ స్థానానికి ఎగబాకింది. సౌతాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. శ్రీలంక బ్యాటర్ చమారీ ఆటపట్టు, ఇంగ్లండ్ బ్యాటర్ నతాలీ సీవర్ బ్రంట్, ఆసీస్ ప్లేయర్ ఎల్లిస్ పెర్రీ 3, 4, 5 స్థానాల్లో ఉన్నారు. భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ రెండు స్థానాలు కోల్పోయి 13వ స్థానానికి పడిపోయింది.టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఓ స్థానం మెరుగుపర్చుకుని 11వ స్థానానికి చేరగా.. భారత్కే చెందిన జెమీమా రోడ్రిగెజ్ ఆరు స్థానాలు మెరుగుపర్చుకుని 15వ స్థానానికి ఎగబాకింది. ఆస్ట్రేలియా ప్లేయర్లు బెత్ మూనీ, తహిళ మెత్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. భారత్కు చెందిన దీప్తి శర్మ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని రెండో స్థానానికి ఎగబాకింది. ఇంగ్లండ్కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ టాప్ ప్లేస్లో కొనసాగుతుంది.




# గాయం కారణంగా టెస్టు సిరీస్కు దూరమైన హేజిల్వుడ్

స్పోర్ట్స్ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ఆస్ట్రేలియా పేస్ బౌలర్ జోష్ హేజిల్వుడ్ మళ్లీ గాయపడ్డాడు. దీంతో అతను భారత్తో జరిగే మిగితా రెండు టెస్టులకు దూరంకానున్నాడు. కుడి కాలుకు చెందిన పిక్క కండరాల్లో నొప్పి వస్తోంది. దీని వల్ల ప్రస్తుత టెస్టుతో పాటు రాబోయే రెండు టెస్టులకు కూడా హేజిల్వుడ్ దూరం కానున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తన ప్రెస్ రిలీజ్లో పేర్కొన్నది. టెస్టు సిరీస్కు దూరం అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో.. అతని స్థానంలో మరో బౌలర్కు చోటు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. వార్మప్ సమయంలో హేజిల్వుడ్ కండరాలకు గాయమైంది. నాలుగవ రోజు కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేశాడు.అడిలైడ్లో గాయం వల్ల ఆడలేకపోయిన హేజిల్వుడ్.. బ్రిస్బేన్లో ఆడినా మళ్లీ అతనికి గాయమైంది. పిక్క కండరాలకు గాయం వల్ల అతను సిరీస్కు దూరం అయ్యే ప్రమాదం ఉన్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. త్వరలో అతని స్థానంలో కొత్త బౌలర్ను ప్రకటించనున్నట్లు సీఏ పేర్కొన్నది. అడిలైడ్ టెస్టులో హేజిల్వుడ్ స్థానంలో ఆడిన స్కాట్ బోలాండ్.. మళ్లీ ఆసీస్ జట్టులో చేరే ఛాన్సున్నది. బాక్సింగ్ డే టెస్టుకు అతను అందుబాటులో ఉండనున్నాడు.

# 'భగవంతుడా.. నేను ఇంకేం చేయాలో చెప్పు'..

స్పోర్ట్స్ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):టీమిండియా యంగ్ క్రికెటర్ పృథ్వీషాకు 2024లో గ్రహణం పట్టుకుంది. పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ లో వరుసగా ఎదురు దెబ్బలు తింటున్నాడీ ట్యాలెంటెడ్ క్రికెటర్. దీంతో నిరాశలో కూరుకుపోయిన అతను తనకు ఇష్టమైన భగవంతుడిని తల్చుకుంటూ సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. కొన్నేళ్ల క్రితం పృథ్వీ షాను భారత క్రికెట్ భవిష్యత్తుగా భావించారు. స్టాండ్స్ లో కానీ షాట్ సెలెక్షన్లో సచిన్ ను గుర్తు చేయడంతో మరో మాస్టర్ బ్లాస్టర్ దొరికేశాడన్నారు. అందుకు తగ్గట్టుగానే చిన్న వయసులోనే టీమిండియా తలుపు తట్టాడు. కొన్ని మ్యాచుల్లో బాగానే రాణించాడు. అయితే ఉన్నట్లుండి పృథ్వీ షా క్రికెట్ కెరీర్ కు గ్రహణం పట్టుకుంది. పేలవమైన ఆటతీరు కారణంగా మొదట టీమ్ ఇండియా నుంచి తప్పించారు. ఆ తర్వాత ఐపీఎల్ టోర్నీ లోనూ ఉద్వాసన తప్పలేదు. ఇప్పుడు సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో కూడా నిలకడగా రాణించలేకపోయాడు. టోర్నీలో ముంబై గెలిచింది కానీ పృథ్వీషా ఆకట్టుకోలేకపోయాడు. ఫైనల్ మ్యాచ్ లోనూ 10 పరుగులతో సరిపెట్టుకున్నాడు. ఇప్పుడు ఈ ముంబై క్రికెటర్ కు మరో ఎదురు దెబ్బ తగిలింది. ప్రతిష్ఠాత్మక టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ నుంచి పృథ్వీషాను తప్పించారు. దీంతో అతని క్రికెట్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చ మొదలైంది.కాగా విజయ్ హజారే ట్రోఫీ నుంచి తనను తప్పించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు పృథ్వీషా. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. '65 ఇన్నింగ్స్లు, 55.7 సగటు, 126 స్ట్రైక్ రేట్తో 3399 పరుగులు, దేవుడా.. నేను ఇంకా ఏం చేయాలో చెప్పు. ఈ గణంకాలు ఉన్న నేను పనికి రానా? అయినా నీపైనే నేను నమ్మకం పెట్టుకున్నాను. జనాలకు నాపైన ఇంకా నమ్మకముందని ఆశిస్తున్నాను.ఎందుకంటే నేను ఖచ్చితంగా తిరిగి వస్తాను..ఓం సాయిరామ్' అని తన ఆవేదనకు అక్షర రూపమిచ్చాడు పృథ్వీషా.




# సోషల్ మీడియాలో రోహిత్ శర్మ రిటైర్మెంట్పై చర్చ..!


స్పోర్ట్స్ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలోనూ భారత కెప్టెన్ రోహిత్ శర్మ పేలవమైన ఫామ్ కొనసాగుతున్నది. గబ్బా వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో నాలుగో ఇన్నింగ్స్లో అవుట్ అయ్యాడు. రోహిత్ను మరోసారి పాట్ కమిన్స్ అవుట్ చేశాడు. కమిన్స్ వేసిన బంతి రోహిత్ బ్యాట్ ఎడ్జ్కి తాకి.. కీపర్ అలెక్స్ కారీ చేతుల్లోకి వెళ్లింది. 27 బంతుల్లో 10 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. టీమిండియా అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా మరోసారి స్పందించారు. ఆస్ట్రేలియా పర్యటనలో పెర్త్ టెస్ట్కి రోహిత్ దూరమైన విషయం తెలిసిందే. అడిలైడ్లో జరిగిన డే-నైట్ టెస్ట్కు అందుబాటులోకి వచ్చాడు. ఓపెనింగ్కు దిగాల్సిన హిట్మ్యాన్ ఆరేళ్ల తర్వాత తొలిసారిగా మిడిలార్డర్లో బ్యాటింగ్కు దిగాడు. అడిలైడ్ టెస్టు తొలి ఇన్నింగ్స్లో 23 బంతుల్లో మూడు పరుగులు, రెండో ఇన్నింగ్స్లో 26 బంతుల్లో 9 పరుగులు చేసి రోహిత్ పెవిలియన్కు చేరాడు. ఇక మూడో టెస్ట్లో రోహిత్ క్రీజులోకి వచ్చిన సమయంలో భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. మూడోరోజు వర్షం కారణంగా క్రీజులో ఉండేందుకు ఎక్కువగా అవకాశం దొరకలేదు. నాలుగో రోజైన మంగళవారం కెప్టెన్ పది బంతులు ఎదుర్కొని.. పది పరుగులు చేసి పెవిలియన్కు చేరాడు. అవుట్ అయ్యాక రోహిత్ చేతిలో గ్లౌజులు పెట్టుకుని పెవిలియన్ వైపు నడిచిన తీరు.. టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ కానున్నాడనే చర్చ సోషల్ మీడియాలో ఊపందుకున్నది. ఈ ఏడాది టీ20 వరల్డ్ కప్ టైటిల్ను గెలిచిన తర్వాత అంతర్జాతీయ టీ20 క్రికెట్కు వీడ్కోలు పలికాడు.గత కొంతకాలంగా టెస్టుల్లోనూ పేలవమైన ఫామ్తో రోహిత్ ఇబ్బందిపడుతున్నాడు. ఈ క్రమంలో హిట్మ్యాన్ని లక్ష్యంగా చేసుకొని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఏడాదిలో రోహిత్ పెద్దగా రాణించలేకపోయాడు. ఇప్పటి వరకు 24 ఇన్నింగ్స్లో 26.39 సగటుతో కేవలం 607 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు స్వదేశంలో న్యూజిలాండ్తో జరిగిన మూడు టెస్టుల సిరీస్లో రోహిత్ 91 పరుగులు చేశాడు. ఇక మ్యాచ్ గురించి చెప్పాలంటే నాలుగో రోజు వర్షం ఇబ్బంది కలిగించింది. ప్రస్తుతం గబ్బా టెస్ట్లో టీమిండియా 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసి ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఆకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా క్రీజులో ఉన్నారు.





# సినిమా న్యూస్

## జనవరిలో ప్రారంభం కాబోతున్న మహేష్ రాజమౌళి సినిమా ?



మూవీ న్యూస్,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):మహేశ్‌బాబు, రాజమౌళి సినిమా అప్‌డేట్ కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులంతా ఆతృతతో ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది? అనే విషయంపై ఇప్పటివరకూ రకరకాల వార్తలొచ్చాయి. అయితే.. వాటిలో నిజానిజాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభానికి సంబంధించి విశ్వసనీయ సమాచారం అందింది.సంక్రాంతి తర్వాత ఈ సినిమా షూటింగ్‌కు రాజమౌళి కొబ్బరికాయ కొట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ కూడా పూర్తయ్యాయని తెలిసింది. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీతోపాటు, నగర శివార్లలో కొన్ని భారీ సెట్లను కూడా రూపొందించారు. తొలి షెడ్యూల్ వాటిలోనే జరుగుతుందట. సంక్రాంతి తర్వాత షూటింగ్ మొదలుపెట్టి, ఏప్రిల్ వరకూ చిత్రీకరణ జరపుతారని సమాచారం.తర్వాతి షెడ్యూల్ విదేశాలలో ఉంటుందట. ఈ సినిమా అధికారిక ప్రకటనకు సంబంధించిన గ్లింప్స్ ఇప్పటికే సిద్ధమైందని, త్వరలో ఇతర నటీనటుల్ని కూడా పరిచయం చేసే అవకాశం ఉందని చిత్రబృందం చెబుతున్నది. అనవాయితీ ప్రకారం త్వరలోనే ఓ ప్రెస్‌మీట్‌ను కూడా రాజమౌళి పెట్టనున్నారట. వెయ్యికోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా ఈ సినిమాను నిర్మాత కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.

## స్పిరిట్‌లో మృణాల్ ఠాకూర్ ?



మూవీ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):అరంగేట్రం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది మరాఠీ భామ మృణల్ ఠాకూర్. సీతారామం, హాయ్ నాన్న చిత్రాల్లో ఈ భామ అభినయానికి ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ హిందీ సినిమాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ నాలుగు ప్రాజెక్ట్స్‌లో నటిస్తూ బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ భామ తెలుగులో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. ప్రభాస్ 'స్పిరిట్' చిత్రంలో ఆమె కథానాయికగా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. సందీప్‌రెడ్డి వంగా డైరెక్ట్ చేయబోతున్న 'స్పిరిట్' మూవీ ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా ఇదే కావడంతో భారీ అంచనాలేర్పడ్డాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది.జనవరిలో షూటింగ్ మొదలుకానున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్ ఖరారయ్యే అవకాశాలున్నాయని ముంబయి సినీ సర్కిల్స్‌లో వార్తలొస్తున్నాయి. ఇదే గనుక నిజమైతే మృణాల్ ఠాకూర్ కెరీర్‌లోనే ఇదే అతిపెద్ద ఆఫర్ అవుతుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

## ప్రేమికుల రోజే లైలా



మూవీ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):యువ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. రామ్‌నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. ఈ చిత్రాన్ని వాలైంటైన్ డేను పురస్కరించుకొని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో విశ్వక్‌సేన్ ట్రెండీ లుక్స్‌తో కనిపిస్తున్నారు. ఈ సినిమాలోకి కొన్ని ఎపిసోడ్స్‌లో విశ్వక్‌సేన్ అమ్మాయి పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన స్పెషల్ మేకోవర్‌కు సిద్ధమయ్యారని, లేడీ గెటప్‌లోకి సన్నివేశాలు చక్కటి హాస్యాన్ని పండిస్తాయని చిత్రబృందం పేర్కొంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. జనవరి 1న ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్‌ప్రసాద్, సంగీతం: లియోన్ జేమ్స్, దర్శకత్వం: రామ్ నారాయణ్.

## ఏడాదికో సినిమా చేయాలనుకుంటున్నా..

మూవీ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ఇండియన్ ఫిలిం



ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు అమీర్ ఖాన్ . ఇండస్ట్రీకి ఎన్నో సూపర్ హిట్స్ అందించిన అమీర్ ఖాన్.. చాలా రోజులుగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నాడు. తాజాగా ఓ చిట్‌చాట్ సెషన్‌లో ఈ స్టార్ హీరో చేసిన కామెంట్స్ అభిమానులు, ఫాలోవర్లలో ఫుల్ జోష్ నింపుతున్నాయి. ఓ నటుడిగా ఏడాదికో సినిమా చేయాలని అనుకుంటున్నానన్నాడు అమీర్‌ఖాన్. అంతేకాదు వచ్చే పదేళ్లలో మరిన్ని సినిమాలను నిర్మించాలనుకుంటున్నానన్నాడు. అంతేకాదు తన డ్రీమ్ ప్రాజెక్ట్ మహాభారత్‌ను తెరకెక్కించాలనుకుంటున్నట్టు చెప్పాడు. ఒకవేళ నేను ఈ సినిమా చేయగలిగితే.. ఈ ప్రాజెక్టుతో ప్రతీ భారతీయుడు గర్వపడేలా చేయాలని, భారతదేశం గురించి ప్రపంచానికి చూపించాలనుకుంటున్నానన్నాడు. అవార్డ్స్ షోలకు నో చెప్పడం గురించి ప్రశ్నించగా.. సినిమా అనేది సబ్జెక్ట్ ఓరియెంటెడ్‌గా సాగుతుంది.. ప్రతీ సినిమా సొంత కథను కలిగి ఉంటుందని చెప్పుకొచ్చాడు.ప్రస్తుతం సితారే జమీన్ పర్, కూలీ, లాహెూర్ 1947 సినిమాలు అమీర్ ఖాన్ ఖాతాలో ఉన్నాయి.

## ఆకట్టుకుంటున్న మోహన్ లాల్ బరోజ్ ట్రైలర్

మూవీ న్యూస్ ,17 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే వీటిలో ఒకటి బరోజ్ . మోహన్‌లాల్ స్వీయదర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ డిగామా బంగ్లాలోపల ఎవరికీ కనిపించని భూతం ఉందంటూ ఓ చిన్నారి వాయిస్ ఓవర్‌తో మొదలైంది ట్రైలర్.వందల సంవత్సరాలుగా నిధులు కాపాడుకుంటూ వస్తోన్న భూతం. మిగితా వారి కోసం కార్చే కన్నీరు కంటే మహత్తరమైన నిధి ఈ లోకంలో మరేది లేదంటున్నాడు బరోజ్. నిధుల తోటకు కాపాలా ఉండే బరోజ్ కథ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది.మోహన్‌లాల్ స్వీయదర్శకత్వంలో వస్తోన్న చిత్రం బరోజ్ . కనకపు సింహాసనంపై రాజసం ఉట్టిపడేలా కనిపిస్తూ.. సినిమాపై హైప్ పెంచేస్తున్నాడు. జోజో పున్నూస్ కథనందిస్తున్న ఈ మూవీని ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరంబవూరు తెరకెక్కిస్తున్నారు. మోహన్ లాల్ మరోవైపు నందకిశోర్ దర్శకత్వంలో పాన్ ఇండియా మూవీ వృషభ లో కూడా నటిస్తున్నాడు. తెలుగు, మలయాళ బైలింగ్యువల్ చిత్రంగా వస్తోన్న ఈ చిత్రంలో టాలీవుడ్ నటుడు రోషన్ మేక కీలక పాత్రలో నటిస్తున్నాడు.



అదేవిధంగా కన్నప్పతోపాటు రామ్ , రాంబాన్ , ఎల్2: ఎంపురాన్ మోహన్ లాల్ ఖాతాలో ఉన్నాయి.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com